ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
గురువారం 30 అక్టోబరు 2025 | 5



తుఫాన్ తీవ్రత స్వల్పమే

- జిల్లాలో 54 విద్యుత్ సబ్ స్టేషన్లపై ప్రభావం
- పడిపోయిన 300 విద్యుత్ స్తంభాలు
- 134 కిలోమీటర్ల మేర కుప్పకూలిన వృక్షాలు
- బాధిత కుటుంబాలకు రూ.3వేల ఆర్థికసాయం
- సమీక్షలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి అచ్చెన్నాయుడు

6

పల్లిపాలెంలో గోదావరి పోటునీరు రాకుండా చర్యలు

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి అచ్చెన్నాయుడు

అంతర్వేది, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది పల్లిపాలెంలో పునరావాస కేంద్రాన్ని మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, టీడీపీ ఇన్‌చార్జి గొల్లపల్లి అమూల్యతో కలిసి బాధితులను పరామర్శించారు. విజన్ ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో ముందస్తు తుఫాన్ హెచ్చరికలు జారీ చేసి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి ప్రాణ,ఆస్తి నష్టాలు జరగకుండా చూడగలిగామని తెలిపారు. ఆ లక్ష్మీనరసింహస్వామి కరుణాకటాక్షాలతో అంతర్వేది పరిసర ప్రాంతాలు సురక్షితంగా తుఫాన్ నుంచి బయటపడ్డాయన్నారు. పల్లిపాలెం గ్రామం అమవాస్య, పౌర్ణమి రోజుల్లో గోదావరి పోటు నీరుకు ముంపునకు గురవుతూ తుఫాన్ సమయంలో గ్రామంలోకి నీరు రాకుండా రివిట్‌మెంట్ వాల్‌లను రెండు కిలోమీటర్ల మేర నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని బాధితులు అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు. మత్స్యకార కుటుంబాలకు 50 కిలోలు బియ్యం, ఉల్లిపాయలు, మంచినూనె, బంగాళాదుంపలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో గుండుబోగుల పెద్దకాపు, గుబ్బల ఫణికుమార్, ముప్పర్తి నాని, చాగంటి స్వామి, మూలాస్వామి, తిరుమాని ఆచార్యులు, బందెల పద్మ, మోకా పార్వతి, పొన్నాల విజయ్, తాడి సత్యనారాయణ, పోతురాజు కృష్ణ పాల్గొన్నారు.


తుఫాన్ షెల్టర్ వద్ద బాధితులతో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

నేటినుంచి యథావిధిగా పాఠశాలలు, కళాశాలలు

ముమ్మిడివరం,అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ముంథా తుపాన్ తీరం దాటడంతో జిల్లాలోఉన్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు గురువారం నుంచి యథావిధిగా పనిచేస్తాయని జిల్లావిద్యాధికారి షేక్ సలీంబాషా తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో ఉన్న ఉపవిద్యాధికారులు, మండల విద్యాధికారులు, పాఠశాల హెచ్ఎంలు అందరికీ ఈ సమాచారం పంపించామని వివరించారు. పదో తరగతి విద్యార్థులకు 100రోజులు ప్రత్యేక యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేసి అమలు చేస్తామన్నారు.

అమలాపురంటౌన్,అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా జూనియర్ కళాశాల భవనాలను రీహేబిలిటేషన్ సెంటర్లుగా ఇచ్చామని ఇంటర్మీడియట్ జిల్లా విద్యాశాఖాధికారి వనుము సోమశేఖరరావు తెలిపారు. జిల్లాలోని జూనియర్ కళాశాలలు, హైస్కూల్ ప్లస్ విద్యాసంస్థలను మూడురోజులపాటు రీహేబిలిటేషన్ సెంటర్లుగా ఇచ్చామన్నారు.తుఫాన్ ప్రభావం తగ్గడం వల్ల గురువారంనుంచి జిల్లాలోని జూనియర్ కళాశాలలు, హైస్కూలు ప్లస్ సంస్థలు యథావిధిగా పనిచేస్తాయని తెలిపారు.

మిమ్మల్ని ఆదుకునేందుకే నేనున్నా

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో తుఫాన్ ప్రభావానికి గురైన ప్రాంతాన్ని హెలికాప్టర్‌లో ఏరియల్ సర్వే ద్వారా పొలాలను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు



- ఓడలరేవు పునరావాస కేంద్రంలో తుఫాన్ బాధితులకు సీఎం భరోసా
- రైతులను ఆదుకుంటానని బెండమూర్లంకలో హామీ
- ఓడలరేవులో పర్యటించిన చంద్రబాబు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

తుఫాన్ కష్టాల్లో ఉన్న మిమ్మల్ని ఆదుకోవడానికే నేను ఉన్నా.. అందుకే వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోయినా మిమ్మల్ని పలుకరించి ధైర్యం చెప్పాలని వచ్చానమ్మా. మీరెవ్వరూ భయపడొద్దంటూ తుఫాన్ బారినపడిన బాధితులకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు భరోసా ఇచ్చారు. మొంథా తుఫాన్ నష్టాలను హెలికాప్టర్‌లో ఏరియల్ సర్వే ద్వారా పరిశీలించి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఓడలరేవు ఓఎన్జీసీ టెర్మినల్‌లో బుధవారం మధ్యాహ్నం దిగిన చంద్రబాబుకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, ఎంపీ హరీష్‌బాలయోగితోపాటు కలెక్టర్ మహేష్‌కుమార్ తదితరులు స్వాగతం పలికారు. అనంతరం చంద్రబాబునాయుడు నేరుగా ఓడలరేవులోని తుఫాన్ షెల్టర్‌లో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రానికి చేరుకున్నారు. అక్కడ షెల్టర్‌లో ఉన్న బాధితులను చంద్రబాబు అందరినీ పలుకరిస్తూ నమస్కరిస్తూ ముందుకు సాగారు. తర్వాత బాధితుల కష్టాలను అడిగి తెలుసుకున్నారు. తుఫాన్ హెచ్చరికలు తమను ఎంతో భయాందోళనకు గురిచేశాయని, మంగళవారం రాత్రి బతుకు జీవుడా అంటూ భయం గుప్పిట్లో జీవించామని మహిళలు చంద్రబాబు ముందు ఆవేదన వ్యక్తం చేశారు. వారి కష్ట సుఖాలను చంద్రబాబు అడిగి తెలుసుకుని మీరెవ్వరూ అధైర్య పడొద్దు నేనున్నానంటూ వారందరికీ భరోసా ఇచ్చారు. ఆ ప్రాంతంలో తుఫాన్ ప్రభావంతో జరిగిన నష్టాలను అడిగి తెలుసుకున్నారు.


అల్లవరం మండలం ఓడలరేవులో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రంలో తుఫాన్ బాధితులతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు


అల్లవరం మండలం బెండమూర్లంకలో పడిపోయిన వరిచేలను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు

అనంతరం బాధితులకు 25 కిలోల బియ్యం ఒక్కో కుటుంబానికి రూ.3 వేలు వంతున ఆర్థికసాయాన్ని చంద్రబాబు అందజేశారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రజలు పడే ఇబ్బందులు నాకు తెలుసు. అందుకే వారికి ఏ కష్టం కలగకుండా అన్నివిధాలా చర్యలు తీసుకుంటూ వారిని మనస్ఫూర్తిగా ఆదుకుంటాను. అది నా నైజం. దీంట్లో ఎటువంటి రాజకీయాలు ఉండవు. మీకు ఏ కష్టం వచ్చినా నేనున్నాను అనే భరోసా ఇచ్చేందుకు ఇంతదూరం వచ్చి మీతో మాట్లాడితే మీ కష్టం తీరడంతోపాటు నాలో కూడా బాధ తగ్గుతుంది.. మీరు అధైర్య పడొద్దు. మీకు నేనున్నానంటూ పదేపదే భరోసా ఇచ్చారు. అదే రీతిన బెండమూర్లంకలో తుఫాన్ వల్ల దెబ్బతిన్న పంట నష్టాలను పరిశీలించిన సీఎం చంద్రబాబు రైతు నాయకులు యాళ్ల బ్రహ్మానందం, యాళ్ల దొరబాబులతోపాటు పలువురు రైతుల నుంచి నష్టాలను అడిగితెలుసుకున్నారు. పంట నష్టాలను అధికారులు నివేదించిన తర్వాత రైతులకు సహాయం ప్రకటిస్తానని రైతుల సమక్షంలో హర్షధ్వానాల మధ్య ప్రకటించి వారికి భరోసా ఇచ్చారు.


కోనసీమ జిల్లా అంతర్వేదిలో తుఫాన్ అనంతరం భీకర అలలు

తుఫాన్ అలలతో అల్లాడిన ఓడలరేవు

అల్లవరం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ తీరం దాటే సమయంలో మంగళవారం అర్ధరాత్రి నుంచి సముద్రపు రాకాసి అలలు ఓడలరేవు ఓఎన్జీసీ ప్లాంటు ప్రహరీని తాకి అలజడి సృష్టించాయి. పంచనది డ్రెయిన్ గుండా అలల పోటుతో ఓడలరేవు మన్నా కాలనీ ముంపు బారిన పడింది. పలు డ్రెయిన్లు పొంగి ప్రవహిస్తున్నాయి. మండలంలో 50కుపైగా విద్యుత్‌స్తంభాలు నేలకూలడంతో రెండు రోజులుగా మండలంలోని అనేక గ్రామాలు అంధకారంతో కొట్టుమిట్టాడుతున్నాయి.

ప్రాణనష్టం జరగకుండా ప్రభుత్వం చర్యలు

- రైతులకు అండగా నిలుస్తాం: సీఎం చంద్రబాబు


ఓడలరేవు తుఫాన్ షెల్టర్ పునరావాస కేంద్రంలో బాధితులతో మాట్లాడుతున్న సీఎం

అల్లవరం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తుఫాన్‌కు జిల్లాలో ప్రాణనష్టం జరగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుందని, నష్టపోయిన రైతులకు అండగా నిలుస్తుందని సీఎం చంద్రబాబునాయుడు భరోసా ఇచ్చారు. అల్లవరం మండలం ఓడలరేవు తుఫాన్ షెల్టర్ పునరావాస కేంద్రంలో తుఫాన్ బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించి వారికి బియ్యం, కూరగాయలు పంపిణీచేశారు. ఓడలరేవులో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం బెండమూర్లంకలో కోనసీమ రైతు పరిరక్షణ కన్వీనర్ యాళ్ల బ్రహ్మానందం, ఎమ్మెల్యే ఆనందరావుతో కలిసి వరిచేలను పరిశీలించారు. డ్రైనేజీ వ్యవస్థ బాగాలేదని, మొగలో చెరువుల ఆక్రమణలవల్ల ముంపు దిగక రైతులు నష్టపోతున్నారని బ్రహ్మానందం వివరించారు. మొగలో ఆక్రమణలు తొలగించి మే 15 నాటికి కాల్వలకు సాగునీరు ఇవ్వాలని కోరారు. ముంపు నివారణకు మొగల్లో ఆక్రమణలు ఖాళీ చేయించాలని కలెక్టర్‌ను సీఎం ఆదేశించారు. రామేశ్వరం, కూనవరం, శంకరగుప్తం మొగల్లో ఆక్రమణలు తొలగించాలని రైతు నాయకులు కోరారు. ఎమ్మెల్యే ఆనందరావుతోపాటు క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబురాజు, బీజేపీ ముఖ్య నేత యాళ్ల దొరబాబు, యాళ్ల కాసుబాబు, యాళ్ల ఈశ్వరరావు వరికంకులను సీఎంకు చూపించారు. ముందుగా ఓడలరేవు ఓఎన్జీసీ టెర్మినల్ వద్ద హెలికాప్టర్‌లో దిగిన చంద్రబాబుకు ఘనస్వాగతం లభించింది. మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యేలు అయితాబత్తుల ఆనందరావు, దాట్ల బుచ్చిబాబు, గిడ్డి సత్యనారాయణ, నిమ్మకాయల చినరాజప్ప, ఎంపీ హరీష్‌బాలయోగి, దెందుకూరి సత్తిబాబురాజు, మెట్ల రమణబాబు తదితరులు ఘనస్వాగతం పలికారు. తుఫాన్ షెల్టర్ వద్ద కలెక్టర్ మహేష్‌కుమార్, ఎస్పీ రాహుల్‌మీనా, ఆర్డీవో కె.మాధవి, డీడీ కర్నీడి మూర్తి, జేసీ టి.నిషాంతి, తహశీల్దార్ వీవీఎల్ నరసింహం, ఎంపీడీవో గౌరీకుమారి, మాజీ ఎమ్మెల్యే చిల్లా జగదీశ్వరి, సర్పంచ్ మల్లాడి మంగాయమ్మ, గుబ్బల రాంప్రసాద్, కొల్లు బాబ్జి, కొల్లు విష్ణుమూర్తి, అల్లు సత్తిబాబు పాల్గొన్నారు.


ఓడలరేవు ఓఎన్జీసీ టెర్మినల్ హెలీప్యాడ్ వద్ద సీఎంతో ఎమ్మెల్యేలు, ఎంపీ

హమ్మయ్య.. గట్టెక్కాం!

- టెన్షన్ మిగిల్చిన మొంథా తుఫాన్
- ప్రశాంతంగా తీరం దాటడంతో ఊపిరిపీల్చుకున్న జిల్లా ప్రజలు, అధికారులు
- యంత్రాంగాన్ని అభినందించిన సీఎం చంద్రబాబు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

గత వారంరోజులుగా మొంథా తుఫాన్ ప్రభావంతో ఉక్కిరిబిక్కిరి అయిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ప్రజలు ఒకింత ఊపిరి పీల్చుకున్నారు. తుఫాన్ మంగళవారం రాత్రి సఖినేటిపల్లి మండలం అంతర్వేదిపాలెం-బియ్యపుతిప్ప మధ్య తీరం దాటింది. దాంతో రాత్రివేళ ఏ విపత్తు ముంచుకొచ్చి ప్రజల ప్రాణ, ఆస్తి నష్టాలకు ముప్పు వాటిల్లుతుందనే ఆందోళన జిల్లా ప్రజల్లో సర్వత్రా నెలకొంది. అయితే తుఫాన్ ప్రభావం తీరంపై పెద్దగా ప్రభావం చూపకపోవడంతో తీరప్రాంత గ్రామాల ప్రజలంతా ఊపిరిపీల్చుకున్నారు. సఖినేటిపల్లి, మలికిపురం మండలాల పరిధిలో వీచిన తీవ్రమైన గాలులకు చెట్లు, వృక్షాలతో పాటు విద్యుత్ స్తంభాలు కూడా నేలకొరిగాయి. దీనివల్ల ఎక్కడా ప్రాణాపాయం లేకుండా అధికారులు అప్రమత్తతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. తెల్లారేసరికి పెద్దగా ఆస్తి నష్టాలు సంభవించలేదన్న సమాచారం సాక్షాత్తూ జిల్లా యంత్రాంగానికి సైతం పెద్ద ఊరటనిచ్చింది. దీనికితోడు సీఎం చంద్రబాబునాయుడు కోనసీమ జిల్లాలోని అల్లవరం మండలం ఓడలరేవు, బెండమూర్లంకలో పర్యటించి బాధితులకు నేనున్నానంటూ భరోసా ఇవ్వడం ద్వారా ప్రజల్లో మరింత ధైర్యం పెరిగింది. తుఫాన్ ప్రభావం వల్ల 20 వేల ఎకరాల వరకు వరి పంటకు నష్టం వాటిల్లింది. వీటితోపాటు జిల్లాలో 1590 హెక్టార్లలో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. 300కు పైగా విద్యుత్ పోల్స్ నేలనంటాయి. వాటిని పునరుద్ధరించే పనిలో సిబ్బంది ఉన్నారు. ఆర్అండ్‌బీ పంచాయతీరాజ్‌రోడ్లు భారీ వర్షాలకు దెబ్బతిన్నాయి. వాటి అంచనాలు తయారు చేయడంలో అధికారులు నిమగ్నమయ్యారు. మామిడికుదురు మండలం మాకనపాలెంలో ఒక మహిళ చెట్టు పడి మృతిచెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. ఇంతకు మించిన ప్రాణ, ఆస్తి నష్టాలు పెద్దగా లేకుండా చేయడంలో అధికారుల కృషి భేష్ అంటూ సీఎం వారిని అభినందించారు.


అల్లవరంలో నేలకూలిన అరటిచెట్లు


అంతర్వేది తుఫాన్ షెల్టర్‌లో భోజన ఏర్పాట్లు





కపిలేశ్వరం మండలం నిడసనమెట్లలో నీటమునిగిన వరిచేను చూసి ఆవేదన చెందుతున్న రైతు... అంతర్వేది గ్రామంలో అధిక వర్షాలకు ఇళ్ల వద్ద మునిగిన దృశ్యం.. అంతర్వేది వెళ్లే ప్రధాన రహదారి వద్ద నీటమునిగిన దృశ్యం

ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ సర్వీసు సమయాల్లో మార్పు

- రాజమహేంద్రవరం నుంచి వచ్చే బస్సు సర్వీసుల్లోనే..
- జిల్లా ప్రజారవాణాధికారి

అమలాపురంరూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల అభ్యర్థన మేరకు రాజమహేంద్రవరం నుంచి అమలాపురం వచ్చే ఎక్స్‌ప్రెస్ సర్వీసుల సమయాలను స్వల్పంగా మార్చినట్లు జిల్లా ప్రజారవాణాధికారి ఎస్టీపీ రాఘవకుమార్ తెలిపారు. రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్ నుంచి అమలాపురం వచ్చే ప్రయాణికుల కోసం ఈ మార్పులను చేశామన్నారు. ప్రతిరోజూ రాజమహేంద్రవరం నుంచి ఉదయం 5.15, 5.45, 6.15, 7, 7.30 గంటలకు సర్వీసులను మార్చినట్టు ఆయన తెలిపారు.

1592.60 హెక్టార్లలో ఉద్యాన పంటలకు నష్టం

- జిల్లాలో విరిగిపడిన 950 కొబ్బరి చెట్లు
- ప్రాథమిక అంచనాలను రూపొందించిన ఉద్యానశాఖ

పి.గన్నవరం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తుఫాన్ తీవ్రత కారణంగా ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. జిల్లాలో కొబ్బరి, అరటి, బొప్పాయి, పసుపు, కూరగాయలు, పువ్వులు, తమలపాకు పంటలకు నష్టం వాటిల్లింది. ఈ ఏడాది పలుమార్లు వరదలు రావడంతో నిన్నటి వరకు ఇబ్బందులు పడిన ఉద్యాన రైతులకు తుఫాన్ రూపంలో మరింత నష్టం వాటిల్లింది.

జిల్లావ్యాప్తంగా తుఫాన్ కారణంగా 1592.60 హెక్టార్లలో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లినట్లు జిల్లా ఉద్యాన అధికారి బీవీ రమణ తెలిపారు. జిల్లాలో 22 మండలాలకు సంబంధించి అరటి 3,960మంది రైతులకు సంబంధించి 1365.40 హెక్టార్లలో, కూరగాయలు 558రైతులకు సంబంధించి 182.40 హెక్టార్లలో, బొప్పాయి 45మంది రైతులకు సంబంధించి 17.60 హెక్టార్లలో, పువ్వులు 62మంది రైతులకు సంబంధించి 16హెక్టార్లలో, పసుపు 32మంది రైతుల కు సంబంధించి 8హెక్టార్లలో, తమలపాకు 10మంది రైతులకు సంబంధించి 3.20హెక్టార్లలో పంటలకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనాలు రూపొందించామని తెలిపారు. అయినవిల్లి మండలంలోని అరటి, బొప్పాయిపంటలను పరిశీలించినట్లు వివరించారు. జిల్లావ్యాప్తంగా కొబ్బరికి సంబంధించి ఈదురు గాలులకు 669 రైతులకుగాను 950చెట్లు కుప్పకూలాయని వివరించారు. బుధవారం మధ్యాహ్నంనుంచి జిల్లా వ్యాప్తంగా క్షేత్రస్థాయిలో ఉద్యాన పంటల నష్టాల నమోదు ప్రక్రియ ప్రారంభించామని తెలిపారు. గ్రామాల్లో ప్రభుత్వ నిబంధనలు అనుసరించి నష్టాల వివరాలు నమోదు చేసేలా ఆదేశాలు ఇచ్చామని స్పష్టంచేశారు. నష్టాల నమోదు తర్వాత నివేదికను తదుపరి చర్యల కోసం కలెక్టర్‌కు అందిస్తామని చెప్పారు.


పి.గన్నవరం మండలం నాగుల్లంకలో తుఫాన్ ప్రభావానికి నేలకూలిన అరటి చెట్లు

జిల్లాలో 200 ట్రాన్స్‌ఫార్మర్లకు నష్టం

- విద్యుత్ సరఫరా పునరుద్ధరించే దిశగా సిబ్బంది కృషి
- ఏపీఈపీడీసీఎల్ సీజీఎం మహేంద్రనాథ్

మామిడికుదురు,అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి):డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో మొంథా తుఫాన్ ప్రభావంతో 200ట్రాన్స్‌ఫార్మర్లు, 600 విద్యుత్‌స్తంభాలు దెబ్బతిన్నాయని ఏపీఈపీడీసీఎల్ సీజీఎం మహేంద్రనాథ్ అన్నారు. బుధవారంఆయన పాశర్లపూడిలో పర్యటించి గ్రామంలో పడిపోయిన విద్యుత్ స్తంభాలను పరిశీలించి విద్యుత్ పునరుద్ధరణకు చేపట్టిన చర్యలను పర్యవేక్షించారు. తమ సిబ్బంది విద్యుత్ సరఫరాను పునరుద్ధరించే దిశగా అహర్నిశలు కృషిచేస్తున్నారన్నారు. ప్రతి వినియోగదారుడికి విద్యుత్‌ను అందించేలా పని చేస్తున్నట్టు తెలిపారు.ఆయనతోపాటు నగరం సబ్‌స్టేషన్ జేఈ వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ కొనుకు నాగరాజు, మాజీ ఎంపీటీసీ చుట్టుగుళ్ల కిశోర్ తదితరులు ఉన్నారు.


పాశర్లపూడిలో విరిగిన విద్యుత్‌స్తంభాన్ని పరిశీలిస్తున్న మహేంద్రనాథ్



అమలాపురం కలెక్టరేట్‌లో తుఫాన్ అనంతర పరిస్థితులపై సమీక్షిస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి అచ్చెన్నాయుడు, కలెక్టర్ మహేష్‌కుమార్, ప్రత్యేకాధికారి విజయరామరాజు, ఎంపీ హరీష్, ఎమ్మెల్యేలు

మొంథా తుఫాన్
తీవ్రత స్వల్పమే

- జిల్లాలో 54 విద్యుత్ సబ్ స్టేషన్‌లపై ప్రభావం
- పడిపోయిన 300 విద్యుత్ స్తంభాలు
- 134 కిలోమీటర్ల మేర కుప్పకూలిన వృక్షాలు
- 41 కేంద్రాల్లో 10వేల మందికి పైగా ఆశ్రయం
- బాధిత కుటుంబాలకు రూ.3వేలు ఆర్థిక సాయం
- సమీక్షలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఇన్‌చార్జి మంత్రి అచ్చెన్నాయుడు



అమలాపురం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావం ముందుగా ఊహించినంత తీవ్రత లేకపోయింది.. అయినప్పటికీ విద్యుత్ సరఫరా, రోడ్లు, రవాణా, రాకపోలకు ఇబ్బంది కలిగించింది అని రాష్ట్ర వ్యవసాయ సహకార, ఉద్యాన, మార్కెటింగ్, డెయిరీ డెవలెప్మెంట్, మత్స్య శాఖల మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం ఆయన జిల్లా స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులతో మొంథా తుఫాన్ సహాయక చర్యలపై సమీక్షించారు. ఈదురుగాలులకు జిల్లావ్యాప్తంగా సుమారు 300 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయన్నారు. 80 శాతం పునరుద్ధరించామని, మిగిలిన 20 శాతం పూర్తి చేసి ఇళ్లకు విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. ఏపీఈపీడీసీఎల్ పర్యవేక్షణలో యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు రేయింబవళ్లు జరుగుతున్నాయన్నారు. జిల్లావ్యాప్తంగా 54 సబ్ స్టేషన్‌లపై మొంథా తుఫాన్ ప్రభావం పడిందన్నారు. రామచంద్రపురం, రాజమహేంద్రవరం, ముమ్మిడివరం తదితర ప్రాంతాల నుంచి మానవవనరులను తరలించి విద్యుత్ సరఫరా చేస్తామన్నారు.

రహదారులపై 134 కిలోమీటర్ల మేర రాకపోకల పునరుద్ధరణ పూర్తయిందన్నారు. బుధవారం నుంచి ఆర్టీసీ బస్సులు నూటికి నూరుశాతం రాకపోకలు సాగిస్తాయని చెప్పారు. మంగళవారం పునరావాస కేంద్రాల్లో భోజన వసతి పొందిన వారికి బుధవారం సాయంత్రం వరకు ఆశ్రయం కల్పిస్తూ రాత్రి భోజనం అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.3వేల ఆర్థిక సాయం అందించి స్వగృహాలకు పంపించాలని అధికారులను ఆదేశించారు.

జిల్లాలో 400 పునరావాస కేంద్రాలు నిర్వహించి 10,150 మందికి ఆశ్రయం కల్పించామన్నారు. వీరిలో కుటుంబాలకు రూ.3వేలు చొప్పున, ఒంటరి సభ్యులకు రూ.వెయ్యి చొప్పున ఆర్థిక సహాయం పంపిణీ చేయాలన్నారు.

ఐదు రోజులుగా సముద్రంపై వేటకు వెళ్లకుండా జీవనోపాధి కోల్పోయిన మత్స్యకారులకు, చేనేత కార్మికుల కుటుంబాలకు 50 కిలోల చొప్పున ఉచిత బియ్యం పంపిణీ చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారన్నారు.

గురువారం నుంచి రేషన్ డీలర్ల ద్వారా బియ్యం సరఫరా చేయాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతిని ఆదేశించారు.

జిల్లావ్యాప్తంగా సుమారు 20వేల ఎకరాల్లో వరి పంట నష్టానికి గురైందని ప్రాథమికంగా అంచనా వేశామన్నారు.

వరితో పాటు అరటి తదితర ఉద్యాన పంటలకు జరిగిన నష్టాన్ని గణించడానికి వేయడానికి బృందాలను నియమించామని, పూర్తిస్థాయి నివేదిక రూపొందిస్తామన్నారు. విశ్వవిద్యాలయాల శాస్త్రవేత్తల ద్వారా పంటల నష్టాలను తగ్గించడానికి కృషి చేస్తామన్నారు.

బియ్యం, ఆర్థిక సహాయం పంపిణీలో స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వాములు చేసి పారదర్శకంగా అందించాలనిసూచించారు.

మామిడికుదురు మండలంలో చనిపోయిన మహిళ కుటుంబానికి పోస్టుమార్టం అనంతరం టీఆర్ 27 నష్టపరిహారం రూ.5 లక్షలను పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ద్వారా పంపిణీ చేయాలన్నారు.

సమావేశంలో మొంథా తుఫాన్ సహాయ చర్యల ప్రత్యేకాధికారి వి.విజయరామరాజు, కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ఎస్పీ రాహుల్‌మీనా, జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, ఎమ్మెల్యేలు అయితాబత్తుల ఆనందరావు, నిమ్మకాయల చినరాజప్ప, అముడా ఛైర్మన్ అల్లాడ స్వామినాయుడు, మెట్ల రమణబాబు, డీఆర్వో కె.మాధవి తదితరులు పాల్గొన్నారు.

ముందుచూపుతో సమర్థవంతంగా ఎదుర్కొన్నాం

కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం (ద్రాక్షారామ), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వాతావరణ శాఖ ముందస్తు హెచ్చరికలు, ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుచూపుతో మొంథా తుఫాన్‌ను అధికారుల సమన్వయంతో సమర్థవంతంగా ఎదుర్కొన్నా మని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. వాతావరణ శాఖ సూచనలతో అధికారులు ప్రజలను అప్రమత్తం చేయడం ద్వారా ప్రాణనష్టం లేకుండా కాపాడామన్నారు. వేలాది మందిని పునరావాస కేంద్రాలకు తరలించడంతో పాటు గర్భిణులు, పిల్లలు, వృద్ధుల పట్ల ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. సీఎం సూచనలతో మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు పరిస్థితిని సమీక్షిస్తూ చర్యలు చేపట్టి నష్టాన్ని తగ్గించగలిగామన్నారు. సమర్థత కలిగిన సీఎం సూక్ష్మస్థాయిలో మేనేజ్‌మెంటు చేయగలడం వల్లే ఇది సాధ్యమైందన్నారు. పునరావాస కేంద్రాల్లో ఉన్నవారికి రూ.3 వేలు నగదు, 25 కిలోల బియ్యం, కిలో ఉల్లిపాయలు, కిలో బంగాళాదుంపలు, కిలో కందిపప్పు, కిలో పంచదార, కిలో ఆయిల్ ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. సమావేశంలో వాసంశెట్టి సత్యం, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాల్లో బాధితులకు నగదు, నిత్యావసరాలు

కోస్తా జిల్లాల ప్రత్యేకాధికారి అజయ్‌జైన్



కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌తో ప్రత్యేకాధికారి అజయ్‌జైన్

సర్పవరం జంక్షన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావిత ప్రజలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నామని కోస్తా జిల్లాల ప్రత్యేక అధికారి, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి అజయ్‌జైన్ పేర్కొన్నారు. బుధవారం ఆయన కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం సూర్యారావుపేట, నేమాం, ఉప్పాడ సముద్ర తీరాన్ని కలెక్టర్ షాన్‌మోహన్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అజయ్ జైన్ మాట్లాడుతూ మొంథా తుఫాన్ ముప్పు తప్పిందన్నారు. గురువారం నుంచి ప్రజలకు నిత్యావసరాలను ఉచితంగా పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశించిందని, ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని యంత్రాంగాన్ని ఆదేశించామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు పునరావాస కేంద్రాల్లో ఉన్న ప్రతి కుటుంబానికి రూ.3వేలు నగదు, 25 కిలోల బియ్యం (మత్స్యకారులకు 50 కిలోలు)తో పాటు కిలో కందిపప్పు, లీటరు వంటనూనె, కిలో చొప్పున ఉల్లిపాయలు, బంగాళాదుంపలు, పంచదార అందజేస్తామన్నారు. తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన వాటి గణన ప్రక్రియ చేపట్టాలన్నారు. తుఫాన్ అనంతరం సహాయక చర్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. తుఫాన్ తీరం దాటినప్పటికీ రెండు రోజుల పాటు దాని ప్రభావం ఉంటుందని, ప్రజలు అంతా అప్రమత్తంగా ఉండాలని కోరారు. పర్యటనలో కాకినాడ రూరల్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ పాల్గొన్నారు.



కొత్తపట్నం వద్ద పైకి వచ్చిన జియోట్యూబ్ గాబియాన్ సంచులు

అలల ఉధృతికి జియోట్యూబ్ ఛిద్రం

కొత్తపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ బీభత్సానికి కాకినాడ జిల్లా ఉప్పాడ సమీపంలో కొత్తపట్నం వద్ద జియోట్యూబ్ పూర్తిగా ఛిద్రమైంది. సముద్రం ఒడ్డున నాలుగైదు అడుగుల లోతులో ఇసుకతో డంప్ చేసిన గాబియాన్ సంచులు కెరటాల ఉధృతికి పైకి లేచాయి.

అధికారులు సమన్వయంతో సేవలందించారు

- అందుకే సమస్యలను అధిగమించాం
- కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్



కొత్తపట్నంలో మీడియాతో మాట్లాడుతున్న ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్

కొత్తపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ సమయంలో కాకినాడ జిల్లా ఉప్పాడ తీర ప్రాంతంలో అధికారులు సమన్వయంతో సేవలందించడంతో సమస్యలను అధిగమించామని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం కొత్తపట్నంలో కెరటాల ఉధృతికి గండిపడిన బీచ్ రోడ్డుకు బండ రాళ్లతో రక్షణ కల్పించడాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ స్థానిక మీడియాతో మాట్లాడారు. తుఫాన్ హెచ్చరికలు జారీ చేసిన వెంటనే కూటమి ప్రభుత్వం వేగంగా స్పందించడంతో ఎక్కడా ఎటువంటి సమస్యలు తలెత్తలేదన్నారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో అధికారులు చేసిన కృషిని అభినందించారు. సీఎం, డిప్యూటీ సీఎం ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షించి సంబంధిత అధికారులకు సూచనలు, సలహాలు ఇచ్చేవారన్నారు. తుఫాన్ ప్రభావం పూర్తిగా తగ్గాక ఎక్కెడక్కడ ఎంతమేర నష్టం జరిగిందో అంచనా వేసి నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తామని ఎంపీ చెప్పారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి (బాబు), ఆ పార్టీ వైద్య విభాగం ప్రతినిధి డాక్టర్ జ్యోతుల శ్రీనివాస్ వున్నారు.

మూడో రోజూ పలు రైళ్లు రద్దు

సామర్లకోట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట మీదుగా విశాఖ, విజయవాడ వైపు రాకపోకలు సాగించే పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను మూడో రోజైన బుధవారం కూడా రద్దు చేశారు. సామర్లకోట రైల్వే స్టేషన్ హెల్ప్ డెస్క్ అధికారి అందించిన సమాచారం మేరకు రద్దయిన వాటిలో 17244 రాయగడ-గుంటూరు, 07166 భువనేశ్వర్-సికింద్రాబాద్, 12805 విశాఖ-లింగంపల్లి, 18521 విశాఖ-కడప- తిరుమల, 12776 లింగంపల్లి-కాకినాడ ఎక్స్‌ప్రెస్ వున్నాయి. డోర్నకల్ జంక్షన్ వద్ద రైల్వే ట్రాక్ పైకి నీరు చేరడంతో మరికొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లను దారి మళ్లించారు. వీటిలో 20833 విశాఖ-సికింద్రాబాద్, 17205 షిర్డీసాయినగర్-కాకినాడ, 17206 కాకినాడ-షిర్డీసాయినగర్ వున్నాయి. 20834 సికింద్రాబాద్-విశాఖ బుధవారం సాయంత్రం మూడు గంటలకు సికింద్రాబాద్‌లో బయల్దేరాల్సి ఉండగా ఐదు గంటలు ఆలస్యంగా రాత్రి ఎనిమిది గంటలకు బయల్దేరింది. రైల్వే ఉన్నతాధికారుల ఆదేశాలతో గురువారం కూడా హెల్ప్ డెస్క్ ద్వారా సేవలందిస్తామని సామర్లకోట రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ రమేష్ చెప్పారు.

కదిలే విపత్తు నిర్వహణ

'ఎన్‌డీఆర్‌ఎఫ్ రెస్క్యూ వాహనం'

- 20 రకాల వస్తువులు.. 10 టన్నుల బరువు
- బాధితుల ఆచూకీ కనుగొనే కెమెరా
- బోట్లు, లైఫ్ బాయ్స్, పవర్ సాలు.. ఇంకా ఎన్నో...



రకరకాల పనిముట్లతో 'ఎస్‌డీఆర్‌ఎఫ్ రెస్క్యూ వాహనం'

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

కేంద్ర ప్రభుత్వ స్థాయిలో జాతీయ విపత్తు స్పందన దళం(ఎన్‌డీఆర్‌ఎఫ్) మాదిరిగా రాష్ట్ర స్థాయిలో రాష్ట్ర విపత్తు స్పందన దళం(ఎస్‌డీఆర్‌ఎఫ్) విపత్తుల సమయంలో సహాయక చర్యలకు రంగంలోకి దిగడానికి ప్రతి క్షణం సిద్ధంగా ఉంటుంది. రెస్క్యూ, వరద సహాయక చర్యలు, ప్రథమ చికిత్సవంటి వాటిలో సహాయపడుతుంది. బాధితులను రక్షించడంతోపాటు ప్రథమ చికిత్స అందించి ఆస్పత్రులకు తరలిస్తోంది. బాధితులకు ఆహారం, తాగునీరు, నిత్యావసరాల వంటి వాటిని పంపిణీ చేయడంలో స్థానిక ప్రభుత్వ యంత్రాంగానికి సహకరిస్తోంది. విపత్తు ప్రాంతాల్లో గందరగోళం ఏర్పడకుండా సహాయక చర్యలు సక్రమంగా జరిగే విధంగా చూస్తుంది. ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందికి అధునాతన రక్షణ టెక్నిక్‌లు, పరికరాల వినియోగం, వివిధ రకాల విపత్తుల్లో స్పందించాల్సిన తీరుపై నిరంతరంగా శిక్షణ ఇస్తుంటారు. విపత్తుల సమయంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జాగృతం చేయడం కూడా విధుల్లో భాగంగా ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక పోలీసు దళాల నుంచి సామర్థ్యం ఆధారంగా ఎంపికచేసి ఎస్‌డీఆర్‌ఎఫ్‌కి సంబంధించి కఠినశిక్షణ ఇస్తారు. విపత్తుల సమయంలో ఆయా ప్రదేశాల్లో ముందస్తుగా ఈ బృందాలను మోహరిస్తారు. రెవెన్యూ శాఖ వీరి వసతి, సదుపాయాలను చూసుకుంటుంది. సహాయం గురించి ఫోన్‌కాల్ వచ్చిన 10 నిమిషాల్లో సిద్ధమై బయలుదేరుతారు. విపత్తు ప్రదేశాలకు వెళ్లిన తర్వాత ఎవరి ఏ పనిచేయాలనే అంశంపై స్పష్టమైన నిర్దేశం ఉండడంతో గందరగోళ పరిస్థితులు ఏర్పడకుండా సహాయక చర్యలు కొన సాగిస్తారు. వీరివద్ద విపత్తు నిర్వహణ సాధనా సంపత్తితో ఉండే వాహనం గురించి ప్రత్యేకమని చెప్పాలి. ఈ వాహనంలో విపత్తు నిర్వహణకు అవసరమైన అన్ని పరికరాలు/వస్తువులు ఉంటాయి. తిత్లీ తుఫాను సమయంలో వీటిలోని కొన్ని పరికరాల కొరత ఉంటే అప్పుడు సీఎంగా ఉన్న చంద్రబాబు వాటిని హెలీకాప్టర్లలో పంపించి వాహనాల్లో సమకూర్చారు. మొత్తం సరంజామాతో కలుపుకొని ఈ వాహనం 10టన్నుల బరువు ఉంటుంది.

మొంథా తుఫాన్‌కి ఉమ్మడి జిల్లాలో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలను మోహరించిన నేపథ్యంలో ప్రత్యేక కథనం.



ఎన్‌డీఆర్‌ఎఫ్ రెస్క్యూ వాహనంతో సిబ్బంది

వాహనంలో ఇవే..

- **ఇన్‌ఫ్లాటబుల్ రబ్బర్ బోట్లు:** వీటిని సులభంగా తరలించవచ్చు. యంత్రంతో గాలి నింపగానే బోటు సిద్ధం అవుతుంది. నీటిలో చిక్కుకున్న వాళ్లను రక్షించడంలో సహాయపడుతుంది. 8 నుంచి 12 వరకూ ప్రయాణించే వీలుంటుంది.
- **చైన్‌సాలు:** బలమైన గొలుసు(చైన్) మాదిరిగా అమర్చి ఉంటే పవర్ సాలు ఇవి. రోడ్లపై చెట్లు పడిన సందర్భంగా తక్కువ వ్యవధిలో వాటిని కట్ చేసి తొలగించడానికి ఉపయోగిస్తారు.
- **హెవీరోప్స్:** లోడు లారీలను సైతం లాగే మంద పాటి తాళ్లు. ఒక్కోటి సుమారు 30 మీటర్లు ఉంటుంది. ఇలాంటివి ఈవాహనంలో 5 నుంచి 10 వరకూ ఉంటాయి.
- **లైఫ్ బాయ్స్:** గుండ్రని ద్విచక్ర వాహనం ట్యూబ్ మాదిరిగా ఉంటాయి. నీటిలోప్రమాదంలో ఉన్న వాళ్లకు వీటిని విసురుతారు. దానిని మెడద్వారా వేసుకుంటే నీటిపై తేలుతూ ఉండొచ్చు.
- **రెస్క్యూ ట్యూబ్స్:** పొడవాటి వెడల్పు ట్యూబులు ఉంటాయి. వీటిలో గాలిని నింపి నీటి లో నుంచి తీసుకురావాల్సిన బాధితుడికి క్లిప్పుల ఆధారంగా అమరుస్తారు. దీంతో అతడు నీటిపై తేలుతూ ఉండగా రెస్క్యూటీం ఒడ్డుకుచేరుస్తుంది. లైఫ్ జాకెట్స్‌ని కోటు మాదిరిగా వేసుకుంటే నీటిలో మునగడం ఉండదు. త్రోబ్యాగ్స్ ఇలాంటివే. ఆ బ్యాగు తాడు అమర్చి ఉంటుంది. బ్యాగ్‌ని బాధితుడు ఒకవైపు పట్టుకోవడం, నడుముకి కట్టుకోవడంచేస్తే తాడుతో ఒడ్డుకు చేరుస్తారు.
- **గొడళ్లు:** పదునైన పెద్ద పెద్ద గొడ్డళ్లు ఉంటాయి. ఒకవేళ పవర్ రంపాలను ఉపయోగించే పరిస్థితి లేకపోతే వీటితో కట్ చేస్తారు. విద్యుత్ వైర్లను విద్యుత్ ప్రవాహం ఉండగానే వీటిలో కట్ చేయవచ్చు. వీటికి ఉండే పిడి ఇన్సులేటర్(షాక్‌ప్రూఫ్) మాదిరిగా పనిచేస్తుంది. పెద్ద సుత్తులు కూడా ఉంటాయి.
- **స్ప్రెడ్డర్ కట్టర్:** ఇనుప తలుపులు వంటి వాటికి పెద్దరంధ్రం పెట్టడానికి ఉపయోగి స్తారు. కారు ప్రమాదం జరిగి డోర్లు రాకపోతే డోరు బలవంతంగా ఊడతీయడానికి సమయం పుడుతుంది. అలా కాకుండా డోరుకు పెద్ద రంధ్రం చేయడం ద్వారా బాధితులను తక్కువ సమయంలో బయటకు తీస్తారు. వాహనంలో ఉండే ఐరన్ కట్టర్లతో ఐరన్ ఊచలు, ప్లేట్లు వంటి వాటిని కట్ చేస్తారు.
- **స్పైన్‌బోట్స్,స్ట్రెచర్స్:** బాధితులను అంబులెన్సులలోకి, మెడికల్ క్యాంపులకు తర లించడానికి, ప్రథమ చికిత్స అందించడానికి ఉపయోగిస్తారు.
- **స్కూబా, స్కూబా సూట్స్:** నీటిలో లోతుకు వెళ్లడానికి స్కూబా, రసాయన విపత్తులు జరిగిన సమయంలో, పొగ కమ్ముకొన్నప్పుడు బాధితులను రక్షించడానికి స్కూబాస్కూట్లు ఉపయోగపడతాయి.
- **వీఎల్‌సీ:** విక్టిం లోకేటింగ్ కెమెరాను వీఎల్‌సీ అంటారు. భవనాలు కూలిన సమయంలో శిథిలాల కింద ఏమున్నాయో చూడడానికి ఇది ఉపకరిస్తుంది. ఒక గొట్టం ద్వారా దీనిని పంపించి శిథిలాల కింద పరిస్థితిని అంచనా వేస్తారు. అక్కడ చిక్కుకున్న బాధితులను రక్షించడంలో ఎక్కువగా ఉపయోగిస్తారు.

ప్రత్యేక ప్రోత్సాహం నిల్


విపత్తు వేళ బయట పడడానికి అందరూ పరుగులు పెడితే.. విపత్తుకు ఎదురెళ్లి బాధితులను రక్షించే విధుల్లో ఎన్‌డీ ఆర్‌ఎఫ్ పని చేస్తుంది. ఈ క్రమంలో ఈ సిబ్బంది ప్రమాదాలే కాకుండా వ్యాధుల బారిన కూడా పడుతూ ఉంటారు. భోజనం చేసే సమయంలో ఫోన్ వస్తే తినడం ఆపేసి తక్షణమే బయలుదేరాల్సిన పరిస్థితులు ఉంటాయి. తిరిగి ఎప్పుడు ఇళ్లకు చేరకుంటారో కూడా తెలియదు. అలాంటి విధుల్లో ఎన్‌డీఆర్ ఎఫ్ సిబ్బందికి ప్రత్యేక ఎలవెన్సులు లేకపోవడం వారిని ఆవేదనకు గురి చేస్తోంది. పోలీస్ విభాగాల్లో కొన్నిటికి ఉదాహరణకు ఈగిల్‌కి 30%, మహిళా పోలీస్ స్టేషన్ 30% ప్రత్యేక ఎలవెన్సు కింది చెల్లిస్తారు. అలాగే ఎన్‌డీఆర్‌ఎఫ్‌కి కూడా ఇవాల్సిన అవసరం ఉంది.

ఎన్‌డీఆర్‌ఎఫ్

జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్‌డీ ఆర్‌ఎఫ్)ను విపత్తు నిర్వహణ చట్టం-2005 ప్రకారం 2006లో ఏర్పాటు చేశారు. కేంద్ర హోంమంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో పని చేస్తోంది. భూకంపాలు, వరదలు, తుఫాన్‌లు, భవనాలు కూలిపోవడం, కొండచరియలు విరిగిపడడం వంటి విపత్తు సమయంలో బాధితులను రక్షించడంలో సహాయం చేస్తుంది. న్యూకియర్ విపత్తుల సమయంలో కూడా ఈ ఫోర్స్ రంగంలోకి దిగుతుంది. ఈదళాల్లో సుశిక్షితులైన సీఆర్పీఎఫ్ తదితర పారా మిలిటరీ పోలీసులు ఉంటారు. వీరికి ప్రత్యేక ఎలవెన్సులు కూడా ఉంటాయి.

అవయవదానంతో నలుగురికి జీవదాత

- గ్రీన్‌ఛానెల్ ద్వారా వేర్వేరు ప్రాంతాలకు తరలింపు




గ్రీన్‌ఛానెల్ ద్వారా అవయవాలను వేర్వేరు ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధమైన దృశ్యం


సామర్లకోట, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో బ్రెయిన్‌డెడ్‌తో ప్రాణాలు కోల్పోయిన ఒక యువకుడు తన అవయవాలను దానంచేసి మరో నలుగురికి ప్రాణదానంతో జీవదాతగా నిలిచాడని కాకినాడజిల్లా సామర్లకోట ఏడీబీ రోడ్డులోని కొప్పవరంవద్ద గల మెడికవర్ హాస్పిటల్స్ సెంటర్ హెడ్ శుభాకరరావు వెల్లడించారు. బుధవారం సాయంత్రం విలేకరుల సమావేశంలో ఈమేరకు జీవదాత వివరాలను తెలియజేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా అమలాపురానికి చెందిన జి.మహేష్ అనే యువకుడు ఈనెల 26న అర్ధరాత్రి రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. మెరుగైన చికిత్స కోసం సదరు యువకుడిని కొప్పవరం మెడికవర్ ఆసుపత్రికి తీసుకురాగా మెడికవర్ వైద్యులు ఎంతమేర వైద్యం అందించినా యువకుడి బ్రెయిన్ ఎంతమాత్రం స్పందించకపోవడంతో 27న వైద్యబృందం యువ కుడిని బ్రెయిన్‌డెడ్‌గా ప్రకటించారన్నారు. ఈ నేపథ్యంలో యు వకుడి తల్లిదండ్రులను అవయవదానంపై అవగాహన ఉండడంతో స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ కుమారుడి అవయవాలను దానం చేసేందుకు అంగీకరించారన్నారు. జీవన్‌దాన్ అనుమతులతో మెడికవర్ హాస్పిటల్స్ వైద్యబృందం తమ హాస్పి టల్‌లోనే అవయవ సేకరణ కార్యక్రమం నిర్వహించారన్నారు. కాకినాడజిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఫోరెన్సిక్ మెడిసిన్ డాక్టర్ పి.ఫణికిరణ్ పర్యవేక్షణలో డాక్టర్ కళ్యాణ్‌బాబు, డాక్టర్ రాజా అమరేంద్ర, డాక్టర్ కిషోర్‌బాబు, డాక్టర్ అరవింద్‌లు క్రిటికల్ కేర్ హెచ్‌వోడీలు, మెడికవర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ టీమ్, సమన్వయంతో అవయవాలను సేకరించారన్నారు. సేకరించిన అవయవాలను గ్రీన్‌ఛానెల్ ద్వారా ఆయా రమైన ఆసుపత్రులకు యుద్ధప్రాతిపదికన తరలించి నలుగురికి కొత్తజీవితం అందించారన్నారు. జీవన్‌దాన్ ప్రతినిధి డాక్టర్ కె.రాంబాబు మాట్లాడుతూ అవయవదానం అనేది జీవితానికి పరమార్థం. ఒకరి జీవిత ప్రయాణం ముగిసినా ఆయన అవయవాలు మరెందరికో కొత్త శ్వాసగా మారతాయన్నారు. ఇది కేవలం దాతృత్వం కాదు సమాజానికి మనం అందించే విలువైన బహుమతిగా అభివర్ణించారు. అంతేకాదు మరొకరికి కొత్తజీవితం అన్నారు. ఇలాంటి దాతృత్వ నిర్ణయాలు సమాజంలో జీవం నింపుతాయని పేర్కొంటూ అవయవదానం చేసేందుకు ముందుకువచ్చిన యువకుడి తల్లిదండ్రులను ప్రోత్సహించిన యువకుడి తల్లిదండ్రులను సెంటర్ హెడ్ శుభాకరరావు అభినందించారు.


శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానంలో

సప్త నదీ జలాభిషేక మహోత్సవాలు ప్రారంభం



శ్రీపాద శ్రీవల్లభుడు, దత్తాత్రేయస్వామి, నృసింహ సరస్వతి





పిఠాపురం శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానంలో పల్లకీ సేవ, సప్త నదీ జలాలకు పూజ చేస్తున్న ఈవో సౌజన్య

పిఠాపురం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానంలో పీఠాధిపతి సజ్జనగడ రామస్వామి ఏకోత్తర శత జయంతి ఉత్సవాల సందర్భంగా శ్రీపాదశ్రీవల్లభ స్వామికి మూడు రోజులు నిర్వహించే సప్త నదీ జలాభిషేక మహోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఉదయం మహాగణపతిపూజ, పుణ్యాహవాచనం, రుత్విక్‌వరణ, శ్రీపాదులకు దత్తాత్రేయ మూలమంత్ర పాశుపతాభిషేకం జరిగాయి. మధ్యాహ్నం అగ్నిప్రతిష్టాపన, లక్ష్మీగణపతి సహిత రుద్రహోమం, దత్త మూలమంత్ర హోమం నిర్వహించారు. ఉదయం పల్లకీ సేవ వైభవంగా జరిగింది. ఆలయంలో సప్త నదీ జలాలకు ఈవో ఆర్.సౌజన్య పూజలు చేశారు. అనంతరం శ్రీపాదశ్రీవల్లభుడు, దత్తాత్రేయస్వామి, నృసింహ సరస్వతిలను పుష్పాలతో అలంకరించారు. భక్తులు భారీగా తరలివచ్చారు.

'మొంథా' ముంచేసింది!

మొంథా తుఫాన్ బీభత్సం సృష్టించింది. దీంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో భారీ ఈదురుగాలులకు భారీ వృక్షాలు, కొబ్బరి చెట్లు పేకమేడల్లా కూలిపోయాయి. విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. వేలాది ఎకరాల్లో పంటలు నీట మునిగి రైతులకు తీవ్రనష్టం వాటిల్లింది. ఆ చిత్రాలే ఇవి


బిక్కవోలు మండలం ఊలపల్లిలో నేలకొరిగిన వరి పంట


ప్రత్తిపాడు మండలం ఒమ్మంగిలో దెబ్బతిన్న పత్తి పంట


పెరవలి మండలం కాకరపర్రు వద్ద నేలవాలిన అరటి గెలలు


కోనసీమ జిల్లా అంతర్వేదిలో నీట మునిగిన గృహాలు


అనపర్తి మండలం పీరా రామచంద్రపురంలో నేలకొరిగిన తాటి చెట్టు


ఉప్పాడలో రహదారిపై కూలిన వృక్షం


రాజవొమ్మంగి మండలం దూసరిపాము గ్రామ శివారులో రోడ్డుపై పడిన చెట్టు


మామిడికుదురు మండలం గెద్దాడలో నేలనంటిన వరిచేలు


మలికిపురం మండలం తూర్పుపాలెంలో నేలకొరిగిన చెట్లు


రాజమహేంద్రవరంలో చెట్ల కొమ్మల తొలగింపును పరిశీలిస్తున్న కమిషనర్ రాహుల్‌మీనా


గోకవరం మండలం గాదెలపాలెంలో నేలకొరిగిన వరి పంట


దేవరపల్లి మండలం పల్లంట్లలో పడిపోయిన బొప్పాయితోట


కె.గంగవరం మండలం పామర్రులో పడిపోయిన వరి పొలం


శంఖవరం మండలం కత్తిపూడిలో కూలిన ఇల్లు


ఏలేరు రిజర్వాయర్‌లో నీటి నిల్వలు పరిశీలిస్తున్న ఎంపీ సతీష్, ఎమ్మెల్యే సత్యప్రభ

'ఏలేరు'లో పెరిగిన నీటి నిల్వలు

దిగువకు 4900 క్యూసెక్కుల విడుదల

ప్రాజెక్టును పరిశీలించిన ఎంపీ సతీష్, ఎమ్మెల్యే సత్యప్రభ

ఏలేశ్వరం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తుఫాను కారణంగా ఎగువ నుంచి వరద నీరు వచ్చి చేరడంతో కాకినాడ జిల్లా ఏలేశ్వంలోని ఏలేరు జలాశయంలో నీటి నిల్వలు పెరుగుతున్నాయి. దీంతో అధికారులు ముందస్తు చర్యల్లో భాగంగా జలాశయం నుంచి దిగువకు 4900 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో మరో 2 టీఎంసీలు నీటిని నిల్వచేసే అవకాశం ఉంది. దీంతో ప్రాజెక్టులో బుధవారం నాటికి 86.56 మీటర్లకుగాను 85.35 మీటర్లు, 24.11 టీఎంసీలకు గాను 21.66 టీఎంసీలు చేరుకున్నాయి. దీంతో విశాఖకు 175 క్యూసెక్కుల నీటిని, దిగువ ప్రాంతాలకు 4900 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఏలేరు జలాశయాన్ని రాజ్యసభ ఎంపీ ఎంపీ సానా సతీష్‌బాబు, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ సందర్శించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రాజెక్టులోని వివిధ గ్యాప్‌లను పరిశీలించారు. ఏలేశ్వరం- అప్పనపాలెం మధ్య ఏలేరు ప్రధాన కాలువపై కుంగిన వంతెనను పరిశీలించారు. కాజ్‌వే నిర్మాణం చేపట్టే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని ఎంపీ స్థానికులకు హామీ ఇచ్చారు. ఏలేరు ప్రాజెక్టుకు పూర్తిస్థాయిలో ఆధునీకరించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. ఏలేరు ప్రాజెక్టు ఛైర్మన్ బస్వా వీరబాబు, తోట నవీన్, కౌన్సిలర్లు అలమండ చలమయ్య, బొదిరెడ్డి గోపి, మూది నారాయణ స్వామి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

స్థిరంగా వరద ఉధృతి

పిఠాపురం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) ఏలేరు వరద ఉధృతి స్థిరంగా కొనసాగుతోంది. రిజర్వాయర్ నుంచి నీటి విడుదలను తగ్గించినప్పటికీ కాకినాడ జిల్లా పిఠాపురం, గొల్లప్రోలు ప్రాంతాల్లో నీటి ఉధృతి మాత్రం తగ్గలేదు. ఏలేరు రిజర్వాయర్‌కు క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి ఇన్‌ఫ్లోస్ గణనీయంగా పెరిగాయి. ఇన్‌ఫ్లోస్ మరింత పెరిగితే నీటి విడుదలను పెంచే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు తెలిపారు.


గొల్లప్రోలు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న ఏలేరు

ఇంటి నుంచి బయలుదేరి.. గోదావరిలో శవంగా తేలి..

మృతదేహంపై కత్తి గాయాలు

తన భర్త మృతికి ఐదుగురు కారణమని భార్య ఆరోపణ


అమలాపురం పోలీసుస్టేషన్ ఎదుట మీడియాతో మాట్లాడుతున్న మృతుడి భార్య దేవి


ఫైల్‌ఫొటో


శ్రీనివాస్ మృతదేహం

అమలాపురం టౌన్/పి.గన్నవరం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి రాజమహేంద్రవరం బయలు దేరిన ఓ వ్యక్తి కొన్నిరోజుల తర్వాత గోదావరిలో శవంగా తేలాడు. అయితే తన భర్త ఆచూకీ తెలపాలంటూ భార్య, బంధువర్గీయులతో కలిసి బుధవారం అమలాపురం పట్టణ పోలీసుస్టేషన్ ఎదుట ఆందోళనకు దిగింది. భర్త అదృశ్యం వెనుక ఐదుగురు వ్యక్తులు ఉన్నారని మీడియాకు చెప్పింది. ఈ సంఘటన జరిగిన గంటల వ్యవధిలోనే భర్త మృతదేహం లభ్యమైంది. ఇందుకు సంబంధించి అమలాపురం పట్టణ సీఐ పి.వీరబాబు, పి.గన్నవరం ఎస్‌ఐ శివకృష్ణ తెలిపిన సమాచారం ఇలా ఉంది.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మం డ లం పేరూరు శివారు కొంకాపల్లికి చెందిన కంచిపల్లి శ్రీనివాస్ (37) ఈనెల 25న ఇంటి నుంచి బయలుదేరి రాజమహేంద్రవరం వెళ్తున్నట్టు భార్య కంచిపల్లి దేవి తెలిపాడు. భర్త తిరిగి రాకపోవడంతో అన్నిచోట్లా గాలించి చివరకు ఈనెల 27న అమలాపురం పోలీసులకు ఆమె ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇంటి నుంచి సుజుకీ మోటారుసైకిల్‌పై బయలుదేరిన శ్రీనివాస్ భార్యతో సాయంత్రం వరకు 3సందర్భాల్లో ఫోన్‌లో మాట్లాడాడు. ఆ తరువాత ఫోన్ స్విచ్ఛాఫ్‌లోకి వెళ్లిపోయింది. ఇదిలా ఉండగా పి.గన్నవరం మండలం ఆర్.ఏనుగుపల్లిలో గోదావరిలో బుధవారం ఉదయం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. ఆ సమాచారాన్ని ఎస్‌ఐ శివకృష్ణ పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి చేతులపై ఎరుపురంగు తాడుతో పాటు కుడిచేతిపైన రుషి, దేవి, వినీత్ అని ఆంగ్ల అక్షరాలతో టాటూలు ఉన్నాయి. హీరో చిరంజీవితో పాటు ప్రముఖ సినీ దర్శకుడు సుకుమార్ టాటూ కూడా మరో చేతిపై ఉంది. దాంతో సమాచారం తెలుసుకున్న పట్టణ పోలీసులు మృతుడి సోదరుడు అంజితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇది శ్రీనివాస్ మృతదేహమే అని అంజి నిర్ధారించాడు. దాంతో ఈ కేసును అమలాపురం పోలీసుస్టేషన్‌కు బదలాయించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమితం అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. డీకంపోజ్ అయిన మృతదేహంపై పలుచోట్ల కత్తితో పొడిచిన గాయాలు ఉన్నట్టు గుర్తించారు. అమలాపురం ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబానికి అందజేశారు. తన భర్త మృతికి అమలాపురానికి చెందిన ప్రముఖ వ్యాపారి గంగుమళ్ల కాసుబాబు, శంకర్, భాస్కర్ల ప్రసాద్, సలాది అప్పన్న, రావులపాలెనికి చెందిన అనిల్ కారణమని మృతుడి భార్య దేవి ఆరోపించింది. పోస్టుమార్టం నివేదిక అందిన తరువాత గానీ తాము ఏమీ చెప్పలేమని పట్టణ సీఐ వీరబాబు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

కాకినాడ రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కుటుంబంలోని ఆర్థిక ఇబ్బందులు కారణంగా యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన కాకినాడ జిల్లా ఇంద్ర పాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. ఎస్‌ఐ ఎం.వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం...కాకినాడ రూరల్ మండలం ఇంద్రపాలెనికి చెందిన కందుకూరి రాజు అతడి కుమారుడు నరేంద్రస్వరూప్(17) కూలీపనులు చేస్తుంటారు. గత కొంతకాలంగా కుటుంబసభ్యులు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. దీంతో ఇంట్లో ఎవరూలేని సమయంలో నరేంద్రస్వరూప్ ఉరి వేసుకుని మృతిచెందాడు. ఈ మేరకు అతడి తండ్రి రాజు ఇచ్చిన ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

ఉప్పుటేరు కాలువలో తేలిన బాలుడి మృతదేహం


(ఫైల్ ఫొటో)


చరణ్‌సాయి మృతదేహం

సర్పవరం జంక్షన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ సూర్యారావుపేట పర్రకాలువలో ఈనెల 27న గల్లంతైన పోలవరపు చరణ్‌సాయి రిత్విక్ (11) మృతదేహం బుధవారం స్థానిక హరిత రీసార్టు సమీపంలో ఉప్పుటేరులో తేలిఉండటాన్ని పోలీసులు గుర్తించారు. కాకినాడ మధురానగర్‌కి చెందిన చరణ్‌సాయి రిత్విక్ సోమవారం మేనమావయ్య కొప్పిశెట్టి శ్రీనివాస్‌తో కలసి బైక్‌పై నేమాం వెళ్లేందుకు సూర్యారావుపేట పర్రకాలువ కాజ్‌వేపై వెళ్తూ ఉప్పుటేరులో పడిపోవడంతో గల్లంతైన సంగతి విదితమే. బాలుడి ఆచూకీ కోసం తిమ్మాపురం ఎస్‌ఐ వై.గణేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఏపీఎస్పీ 3వ బెటాలియన్‌కు చెందిన ఏపీ ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందితో గత 2 రోజులుగా గాలింపు చర్యలు చేపట్టారు. చివరకు చరణ్‌సాయి రిత్విక్ మృతదేహం ఎన్టీఆర్ బీచ్ సమీపంలో ఉన్న హరిత రీసార్టు వెనకాల గల ఉప్పుటేరులో తేలియాడుతూ ఉండడాన్ని గుర్తించారు. పోస్టుమార్టమ్ నిమిత్తం జీజీహెచ్‌కు తరలించి, అక్కడ శవ పంచనామా చేసిన అనంతరం బంధువులకు అప్పగించినట్టు ఎస్‌ఐ తెలిపారు.

రెండు బైకుల ఢీ

ఇద్దరికి గాయాలు

శంఖవరం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా శంఖవరం మండలం కొంతంగి కొత్తూరు మలుపులో రెండు బైకులు ఢీ కొన్నాయి. బుధవారం మధ్యాహ్నం గ్రామానికి చెందిన అప్పన రాంబాబు, గరగ పండు ఎదురెదురుగా బైక్‌లపై వస్తూ మలుపులో ఒకరినొకరు ఢీకొన్నారు. ఇద్దరూ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. రోడ్డుకి ఇరువైపులా తుప్పలు పేరుకుపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొండచిలువ హల్‌చల్..




వలలో చిక్కుకున్న కొండచిలువ

ఉప్పలగుప్తం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం చల్లపల్లి పంచాయతీ జగ్గరాజుపేటలో బుధవారం కొండచిలువ హల్‌చల్ చేసింది. వలలో చిక్కుకుని బయటకు వచ్చేందుకు ప్రయత్నిస్తుండగా స్థానికుల కంటపడింది. సర్పంచ్ ఇసుకపట్ల జయమణీరఘుబాబు సమాచారాన్ని పోలీసు, అటవీశాఖ సిబ్బందికి తెలియజేశారు. వారు వచ్చేలోగానే స్థానికులు కొండచిలువను హతమార్చారు.

రాత్రి ఇంటిలో నిద్రించి... ఉదయం శవంగా కనిపించి!

తుఫాన్ గాలులకు వ్యక్తి మృతి


మరణించిన ఈతకోట శ్రీరాములు

ఉప్పలగుప్తం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం టి.చల్లపల్లి పంచాయతీ పర్రపేటలో బుధవారం ఉదయం ఈతకోట శ్రీరాములు (73) తన ఇంటి ముందే తోటలో శవమై కన్పించాడు. మంగళవారం రాత్రి శ్రీరాములు తన గదిలో పడుకున్నాడు. అర్ధరాత్రి మూత్ర విసర్జన నిమిత్తం బయటకు వచ్చి తుఫాను గాలుల బీభత్సానికి మృతిచెందినట్టు కుటుంబసభ్యులు చెప్తున్నారు. అయితే ఈ విషయంపై పోలీసు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినట్టు గ్రామ సర్పంచ్ ఇసుకపట్ల జయమణీరఘుబాబు తెలిపారు.

విద్యుత్ పునరుద్ధరణ పనుల్లో వ్యక్తి మృతి

అంతర్వేది, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడగా విద్యుత్‌ను పునరుద్ధరించేందుకు అధికారులు, సిబ్బంది చర్యలు చేపట్టారు. అయితే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లిలో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు చేస్తున్న ప్రైవేటు వ్యక్తి యడ్ల సత్యశివశంకర్ (44) విద్యుదాఘాతంతో మృతిచెందినట్టు పోలీసులు తెలిపారు. రాజోలు మండలానికి చెందిన శంకర్ గత పది సంవత్సరాలుగా సఖినేటిపల్లిలో ఉంటూ అప్పుడప్పుడు అవసరం మేరకు విద్యుత్ అధికారులకు హెల్పర్‌గా పనులు చేస్తుంటాడు. అలాగే మొంథా తుఫాన్ నేపథ్యంలో విద్యుత్ పోల్‌పై పనిచేస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ దుర్గాశ్రీనివాస్ తెలిపారు.

కాలువలో యువకుడి మృతదేహం లభ్యం


నాగరాజు (ఫైల్)

అంబాజీపేట, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): బహిర్భూమి వెళ్లి ప్రమాదవశాత్తు మురుగుకాలువలో పడి యువకుడు మృతిచెందాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం ఇసుకపూడి శివారు తురకలదొడ్డికి చెందిన గుబ్బల నాగరాజు(35) ఈ నెల 28న సైకిల్‌పై బహిర్భూమికి వెళ్లాడు. ఇంటికి తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం గాలించారు. గ్రామానికి సమీపంలో ఉన్న మురుగు కాలువలో నాగరాజు శవమై కనిపించాడు. మృతుడి భార్య లక్ష్మీనాగప్రసన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నాగరాజు మృతదేహాన్ని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పరిశీలించి నివాళులర్పించారు. ఆయన వెంట రాష్ట్ర జలవనరుల శాఖ డైరక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, సొసైటీ ఛైర్మన్ అరిగెల సూరిబాబు, టీడీపీ నాయకులు దాసరి వీరవెంకట సత్యనారాయణ, పళ్ల శ్రీనివాసరావు, యనమదల సాయిబాబు తదితరులున్నారు.

అనపర్తిలో అగ్నిప్రమాదం

షార్ట్ సర్క్యూట్‌తో పేలిన ఫ్రిజ్ సిలెండర్

అనపర్తి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా అనపర్తి శివారు కొత్తూరు జగనన్న కాలనీలో బుధవారం సాయంత్రం అగ్ని ప్రమాదం జరిగింది. కాలనీలో నివసిస్తున్న కుక్కల దుర్గాభవాని తన ఇద్దరు కుమార్తెలతో నివాసం ఉంటుంది. బుధవారం సాయంత్రం ఆమె ఇంటి నుంచి పొగలు రావడం గమనించిన స్థానికులు తలుపులు పగులగొట్టి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. ఇంతలోనే ఒక్కసారిగా ఫ్రిజ్ సిలండర్ పేలడంతో ఆ ప్రాంతమంతా భయందోళనలకు గురయ్యారు. స్థానికులు తలుపులు పగులగొట్టి మంటలను అదుపు చేశారు. అనపర్తి అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని నష్టం అం చనా వేశారు. ప్రమాదం జరిగిన సమయంలో ఇంటిలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. సుమారు రూ. 50 వేల వరకు ఆస్తినష్టం ఉంటుందని అంచనా వేస్తున్నామని, విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఈ ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నామని ఫైర్ అధికారి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.




ప్రమాదం జరిగిన ఇంటి నుంచి వస్తున్న పొగలు, పేలిన ఫ్రిజ్ లోపల సిలెండర్

రూ.5వేల ఆర్థిక సాయం

మామిడికుదురు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మాకనపాలెంలో తాడిచెట్టు పడి మరణించిన వీరవేణు కుటుంబానికి నామన ఫౌండేషన్ ద్వారా రూ.5వేలను ఫౌండేషన్ చైర్మన్, జడ్పీ మాజీచైర్మన్ నామన రాంబాబు అందించారు. ప్రభుత్వ పరంగా ఆదుకునేందుకు కృషి చేస్తానన్నారు. ఈలి శ్రీనివాస్, సర్పంచ్ గౌసమొహిద్దీన్ పాల్గొన్నారు.

అంతర్వేదికి పాదయాత్ర

మలికిపురం, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ నుంచిగట్టెక్కడంతో మేడిచర్లపాలెం రామాలయం పీఠం స్వాములు బుధవారం మేడిచర్లపాలెం నుంచి అంతర్వేదికి పాదయాత్రగా వెళ్లి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని పూజలు జరిపించుకున్నారు. ఈవిపత్తు నుంచి గట్టెక్కడంలో లక్ష్మీనరసింహస్వామి మహత్యం ఎంతో ఉందన్నారు.

ప్రపంచ స్ట్రోక్ అవగాహన దినోత్సవం

అమలాపురంరూరల్, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): కిమ్స్ వైద్య కళాశాలలో బుధవారం స్ట్రోక్ డేను ఘనంగా నిర్వహించారు. మెదడుకు రక్తం సరఫరా అకస్మాత్తుగా ఆగిపోవడం, రక్తనాళాలు పగిలిపోవడం వల్ల స్ట్రోక్, పక్షవాతం వస్తుందని మెడికల్ డైరెక్టర్ డాక్టర్ హరికిరణ్‌వర్మ తెలిపారు. స్ట్రోక్ వచ్చినప్పుడు ఆలస్యం చేయకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రముఖ న్యూరాలజిస్టు డాక్టర్ రామఅభిషేక్ తెలిపారు. అధిక రక్తపోటు, మధుమేహం, అతిగా ఆహారం తినడం, మానసిక ఒత్తిడి, వ్యాయామం లేకపోవడం వల్ల స్ట్రోక్ వస్తుందని వివరించారు. అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నవారిని కిమ్స్ చైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు), ఎండీ కె.రవికిరణ్‌వర్మ, డీన్ డాక్టర్ ఆనంద్‌ఆచార్య, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.సుబ్బారావు అభినందించారు.

కొల్లూరికి లైఫ్‌టైమ్ ఎచీవ్‌మెంట్ అవార్డు



పుదుచ్చేరి ముఖ్యమంత్రి రంగస్వామి నుంచి అవార్డు అందుకుంటున్న కొల్లూరి

అమలాపురంటౌన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రముఖ కవి, అంతర్జాతీయ వ్యాఖ్యాత డాక్టర్ ఎస్ఆర్ఎస్ కొల్లూరి ప్రతిష్టాత్మకమైన వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ జీవన సాఫల్య పురస్కారం (లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్) అవార్డును బుధవారం అందుకున్నారు. పుదుచ్చేరిలో వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఇరుపుల రామకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన పుదుచ్చేరి ముఖ్యమంత్రి తిరు ఎన్.రంస్వామి చేతులమీదుగా పురస్కారంతో పాటు రజత జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందుకున్నారు. కొల్లూరిని శాలువాతో ఘనంగా సత్కరించారు.

తుఫాన్ బాధితులను ఆదుకోవాలి

యానాం, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ యానాం బాధితులను పుదుచ్చేరి ప్రభుత్వం ఆదుకోవాలని ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఐదు రోజులుగా తుఫాన్ ప్రభావంతో వీచిన ఈదురుగాలులు, వర్షాలతో అన్ని ప్రాంతాల్లో అపార నష్టం ఏర్పడిందన్నారు. ప్రతి రేషన్ కార్డుదారుడికి రూ.5వేలు చొప్పున నష్ట పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. భారీ వర్షాలకు రహదారులన్నీ పూర్తిగా దెబ్బతిన్నాయని రోడ్ల నిర్మాణానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. తీరప్రాంత గ్రామాల్లో ఉన్న ప్రజలకు పునరావాస కేంద్రాల్లో ఉన్న బాధితులకు ఓల్డ్‌ఏజ్‌హోమ్ ద్వారా ఆహారం పదార్థాలు అందిస్తున్నట్లు తెలిపారు.

తుఫాన్ బాధితులకు పరామర్శ

అల్లవరం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఓడలరేవు, కొమరగిరిపట్నం, ఎస్.రామేశ్వరం గ్రామాల్లో పునరావాసా కేంద్రాల్లో ఆశ్రయం పొందిన బాధితులను మాజీ ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు పరామర్శించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కొనుకు గౌతమి, సర్పంచ్ రాకాపు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మొంథా తుఫాన్ వెళ్లింది.. నష్టం మిగిలింది

- కొబ్బరి, అరటి, బొప్పాయి పంటలకు నష్టం
- దెబ్బతిన్నట్రాన్స్‌ఫార్మర్లు, కూలిన స్తంభాలు
- కూలిన ఇళ్లు, పూరిగుడిసెలు

అంబాజీపేట, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా మంగళవారం ఉదయం నుంచి వీచిన బలమైన ఈదురుగాలులకు మండలంలో 200కొబ్బరిచెట్లు నేలకొరిగాయి. 50ఇళ్లు ధ్వంసం కాగా వివిధ రకాల భారీ వృక్షాలు నేలకొరిగాయి. 48విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ వైర్లు ధ్వంసమైనట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. బుధవారం ఉదయం నుంచి చిరుజల్లులు పడ్డాయి. విద్యుత్‌శాఖ, పంచాయతీ అధికారులు స్పందించి నేలకొరిగిన కొబ్బరిచెట్లు, భారీ వృక్షాలను తొలగించారు. విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. మండలంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను మూసివేసినట్టు తహశీల్దారు చినబాబు తెలిపారు. తుఫాన్ కారణంగా మండలంలో 359ఎకరాల్లో వరి పంటకు నష్ట వాటిల్లినట్టు ఏవో ధర్మప్రసాద్ తెలిపారు. ముంపు బారిన పడిన వరి పొలాలను ఆయన బుధవారం పరిశీలించారు. రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

నష్టపోయిన కుటుంబాలకు న్యాయం

వరి పంటను పరిశీలించిన ఎంపీ, ఎమ్మెల్యే

అంబాజీపేట, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో పలు ప్రాంతాల్లో రైతులకు కొంత మేర పంట నష్టం జరిగిందని, వారిని ఆదుకునే విధంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్, పి.గన్నవరంఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. మొసలపల్లిలో తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న వరి పొలాలను వారు బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఎంపీ హరీష్, ఎమ్మెల్యే సత్యనారాయణ మాట్లాడుతూ తుఫాన్ వల్ల నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వంఆదుకుంటుందన్నారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న కుటుంబాలకు రూ.3వేలు వంతున అందిస్తునట్టు తెలిపారు. నీటిపారుదల శాఖ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, టీడీపీ నియోజకవర్గ కో కన్వీనర్ దాసరి వీరవెంకట సత్యనారాయణ, సొసైటీ చైర్మన్ అరిగెల సూరిబాబు, నాయకులు గుడాల ఫణి, నాగాబత్తుల వెంకట సుబ్బారావు, మైపాల తాతాజీ, కొప్పినీడి ఈశ్వరరావు, కత్తుల బాబులు, పెదపూడి శ్రీనివాసరావు, తహశీల్దారు చినబాబు, ఏవో ధర్మప్రసాద్ పాల్గొన్నారు.

భోజనాల పంపిణీ: తుఫాన్‌కారణంగా వంట చేసుకోవడానికి వీలులేని వారికి అంబాజీపేట నాగాబత్తుల సాహెబ్ మోమోరియల్ ట్రస్టు తరపున టీడీపీ నాయకుడు నాగాబత్తుల వెంకటసుబ్బారావు మాచవరం పరిధిలో 200మందికి భోజనాల పొట్లాలను అందించారు. గోసంగి సత్యనారాయణ, మంచాల వెర్రబ్బాయి, గుత్తుల రామకృష్ణ, యలమంచిలి బుచ్చిబాబు, కత్తుల బాబులు, పులిదిండి శేఖర్ పాల్గొన్నారు.

తుఫాన్ తాకిడికి దెబ్బతిన్న 24గృహాలు

ఐ.పోలవరం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ తాకిడికి మండలంలో 24గృహాలకు నష్టం వాటిల్లినట్టు తహసీల్దార్ సీహెచ్ విజయశ్రీ తెలిపారు. 18తాటాకిళ్లు, మూడు రేకుల షెడ్లు, మూడు పెంకుటిళ్లు దెబ్బతిన్నాయన్నారు. వరి నష్టానికి సంబంధించిన నివేదికను త్వరలోనే ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. తీరప్రాంత గ్రామాలైన జి.మూలపొలం, భైరవపాలెం, గోగుల్లంక ప్రాంతాల్లో బుధవారం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. తుఫాన్ తీరం దాటడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.






అంబాజీపేట: మొసలపల్లిలో వరిచేలను పరిశీలిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, ముమ్మిడివరం: పళ్లవారిపాలెంలో కూలిన ఇల్లు, ఉప్పలగుప్తం: భీమనపల్లిలో నేలనంటిన చేలను పరిశీలిస్తున్న ఏవో కుమార్‌బాబు కాట్రేనికోన: పల్లంలో తుఫాను బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుచ్చిబాబు, ఎంపీ హరీష్‌మాధుర్

2044హెక్టార్లలో వరి పంటకు నష్టం

తుఫాను వల్ల మండలంలో 2,044హెక్టార్లలో సార్వా పంటకు నష్టం వాటిల్లినట్టు మండల వ్యవసాయాధికారిణి ఎం.వాణి తెలిపారు. నాలుగు రోజుల్లో పంట నష్టాలపై ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామన్నారు. టి.కొత్తపల్లిలో ఆమె తుఫాను కారణంగా దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించారు. తిల్లకుప్ప, కేశనకుర్రు, టి.కొత్తపల్లి గ్రామాల్లో 90శాతం మేర సార్వాకు నష్టం జరిగినట్టు వివరించారు.

15 ఇళ్లకు నష్టం

ముమ్మిడివరం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో వీచిన పెనుగాలులు, వర్షాలకు మండల ప్రజల తీవ్ర భయాందోళనలు చెందారు. బుధవారం తెల్లవారుజాము వరకు పెనుగాలులు వీస్తూ వర్షం పడుతూనే ఉంది. మండలంలో 23.2మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పెనుగాలులు, వర్షాలకు ఆరుతాటికల్లు, 9పెంకుటిళ్లకు నష్టం వాటిల్లింది. 58కొబ్బరి చెట్లు నేలకొరిగాయి. 25విద్యుత్ స్తంభాలు విరిగి పడిపోగా మూడుట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయి. రాణేలంక పంచాయతీ పరిధిలోని వరగల్లంకలో ఆవుదూడపై కొబ్బరి ఆకులు పడడంతో మృతి చెందింది. మండలంలో 5,100ఎకరాల్లో వరిసాగు కాగా 2029ఎకరాల్లో వరికి నష్టంవాటిల్లినట్టు ప్రాథమిక అంచనా. రెవెన్యూఅధికారులు 25 పునరావాస కేంద్రాలు ఏర్పాటుచేయగా 19పునరావాస కేంద్రాల్లో 1500మంది తల దాచుకున్నారు. బుధవారం వాతావరణం తెరిపివ్వడంతో ఉదయం బాధితులు తమ ఇళ్లకు చేరుకున్నారు. రోడ్లపై విరిగిపడిన చెట్లను ఆర్‌అండ్‌బీ, అగ్నిమాపక సిబ్బంది ఎప్పటికప్పుడు యుద్ధ ప్రాతిపదికన తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. విద్యుత్ పునరుద్ధరణకు విద్యుత్‌శాఖ అధికారులు కర్నూలు నుంచి తీసుకువచ్చిన సిబ్బందితో మరమ్మతులు చేపట్టి బుధవారం సాయంత్రానికి 11 కేవీమెయిన్ లైనును పూర్తిగా పునరుద్ధరించారు. ఎల్టీలైన్ కూడా చాలావరకు విద్యుత్ పునరుద్ధరణ చేశారు. మండల ప్రత్యేకాధికారి బి.గౌతమ్, తహశీల్దార్ జి.సుభాష్, ఎంపీడీవో దీక్షితులు గ్రామాల్లో పర్యటించి పరిస్థితులు సమీక్షించారు.

దెబ్బతిన్న 8 పూరిగుడిసెలు

పి.గన్నవరం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో బుధవారం మధ్యాహ్నం వరకు భారీస్థాయిలో ఈదురుగాలులు, చిరుజల్లులు పడ్డాయి. దీంతో మండల వ్యాప్తంగా వివిధ చోట్ల కొబ్బరి, మామిడిచెట్లు, పలు రకాలు చెట్లు విరిగిపడటంతో పాటు భారీ వృక్షాలు ప్రధాన రహదారులపై కుప్పకూలాయి. పంచాయతీ రోడ్డులో గేర్రింకల డ్రైన్ వద్ద కొంతమేర ఆర్‌అండ్‌బీ డ్రైన్ కుంగింది. మండల వ్యాప్తంగా పలుచోట్ల వరిచేలు నేలనంటగా, అరటి తోటలకు నష్టం వాటిల్లింది. నాగుల్లంకశివారు కందాలపాలెం తెల్లవారుజామున ప్రధాన రహదారిపై చెట్టు విరిగిపడటంతో సిబ్బంది తొలగించారు.

154 విద్యుత్ స్తంభాలు నేల మట్టం

తుఫాన్ నేపథ్యంలో వివిధ గ్రామాల్లో 154 విద్యుత్ స్తంభాలకు నష్టం వాటిల్లినట్లు విద్యుత్ శాఖఏఈ ఆచార్యులు తెలిపారు. పలుచోట్ల వైర్లపై చెట్లు విరిగిపడటంతో లైన్లు దెబ్బతిన్నాయని, పలు గ్రామాల్లో 9వరకు ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయని చెప్పారు. విద్యుత్ సిబ్బంది పూర్తి స్థాయిలో శ్రమించి బుధవారం సాయంత్రానికి మండల వ్యాప్తంగా పూర్తిస్థాయిలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

41 పునరావాస కేంద్రాలు: తహశీల్దార్

మండలవ్యాప్తంగా 41పునరావస కేంద్రాలు ఏర్పాటుచేసి 1675మందికి భోజనాలు, వసతులు కల్పించామని తహశీల్దార్ పి.శ్రీపల్లవి తెలిపారు. ముంగండ, రాజులపాలెం, ముంగండపాలెం, కె.ఏనుగుపల్లి, కె.ముంజవరంగ్రామాల్లో 8 నివాస గృహాలకు నష్టం వాటిల్లిందన్నారు. పునరావాస కేంద్రాలకు వచ్చిన వారికి నగదు, 25కిలోల బియ్యం, నిత్యావసరాలు అందించామన్నారు. మండలవ్యాప్తంగా 525 హెక్టార్లలో వరి, 130 ఎకరాల్లో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. నాగుల్లంకలో తుఫాన్‌కు దెబ్బతిన్న అరటి పంటను ఎమ్మెల్సీ సోము వీర్రాజు, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా పరిశీలించి ప్రభుత్వం ఆదుకుంటుందని వివరించారు.

ఊపిరిపీల్చుకున్న ప్రజలు

రాజోలు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుఫాన్ మంగళవారం అర్ధరాత్రి తీరం దాటడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు, ఈదురుగాలులకు మండలంలో 2250ఎకరాల పల్లపు ప్రాంతాల్లో వరి పంట నీట మునిగిందని మండల వ్యవసాయాశాఖాధికారి వై.మధుకుమార్ తెలిపారు.1500మంది రైతులు 3356 ఎకరాల్లో వరినాట్లు వేశారని తెలిపారు. రాజోలు జాతీయ రహదారి 216రహదారి పక్కన చెట్టు పడిపోవడంతో ఆ ప్రాంతాన్ని అమలాపురం ఆర్డీవో పనులను పరిశీలించారు. మండలంలో ఐదు ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయని, 57విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయని రాజోలు ట్రాన్స్‌కో ఏఈ పి.మనోజ్ఞ తెలిపారు. విద్యుత్ సిబ్బంది మరమ్మతు పనులు త్వరితగతిన పూర్తిచేసి సరఫరాను పునరుద్ధరిస్తామని తెలిపారు. ములికిపల్లిలో విశాఖపట్నం నుంచి వచ్చిన విద్యుత్ అధికారులతో మాట్లాడి విద్యుత్ స్తంభాలు, తీగలను త్వరితగతిన పనులు చేపట్టాలని గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ సూచించారు. కాట్రేనిపాడులంకలో పునరావాస కేంద్రాన్ని, తుఫాన్ ప్రభావిత ప్రాంతాలను ఆయన పరిశీలించారు. అనంతరం పునరావాస కేంద్రంలో ఉన్న బాధితులకు స్వయంగా ఆయన భోజనాలు వడ్డించారు. రాజోలు డిపో బస్సు సర్వీసులు యథావిధిగా నడుస్తున్నాయని డిపో మేనేజర్ జి.జేమ్స్‌కుమార్ తెలిపారు.ఎంపీపీ కడలి శ్రీదుర్గ, చాగంటి స్వామి, కడలి నీటిసంఘం అధ్యక్షుడు గాలిదేవర వెంకన్నబాబు, అడబాల విజయ్, మామిడిశెట్టి నాగరాజు పాల్గొన్నారు.

నేలకొరిగిన వృక్షాలు, కొబ్బరి చెట్లు

మలికిపురం,అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ తీరం దాటి ప్రజలను ప్రశాంతంగా నిలబడేలా చేసింది.మండల పరిధిలో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు, వృక్షాలు, కొబ్బరిచెట్లు నేలకొరిగాయి. ప్రభుత్వ సహాయ చర్యలు వెంటనే చేపట్టి ఎప్పటికప్పుడు చెట్లను తొలగించారు. ఎలక్ట్రికల్ ఏఈ బి.ప్రసాద్ నేతృత్వంలో విద్యుత్‌కు అంతరాయం లేకుండా పనులు చేపట్టారు. మండలంలో 15గృహాలు నేలకొరగ్గా 120చెట్లు నేలకొరిగాయి. పది ఎకరాల్లో పంట నష్టం జరిగినట్టు తహశీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. పునరావాస కేంద్రాల్లో బాధితులకు రెవెన్యూ ఆధ్వర్యంలో సౌకర్యాలు కల్పించారు. బుధవారం ఉదయం కొద్దిపాటి వర్షంతో ఈదురుగాలులు వీచినప్పటికీ మధ్యాహ్నానికి వాతావరణం తెరిపిచ్చింది.

పునరావాస బాధితులకు రెడ్‌క్రాస్ సహాయం

మొంథా తుఫాన్ బాధితులకు రెడ్‌క్రాస్ సభ్యులు తూర్పుపాలెం, పడమటిపాలెం, సఖినేటిపల్లి మండలంలోని కేశవదాసుపాలెంలో పర్యటించి 300 మంది గర్భిణులు, పిల్లలకు బ్రెడ్లు, పాలు అందించారు. జంపన బుజ్జిరాజు, అల్లూరి మధురాజు, బోనం రాజు పాల్గొన్నారు.

2,128 ఎకరాల్లో సార్వాకు నష్టం

ఉప్పలగుప్తం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలో మొంథా తుఫాన్ కారణంగా 2,128 ఎకరాల్లో సార్వా పంటకు నష్టం జరిగిందని వ్యవసాయశాఖ ఏడీఏ జి.కెనడీ తెలిపారు. బుధవారం ఆయన భీమనపల్లి తదితర గ్రామాల్లో నీటమునిగిన చేలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి సూచనలు చేశారు. మండల వ్యవసాయాధికారి గుత్తుల కుమార్‌బాబు పలు గ్రామాల్లో పంట పొలాలను పరిశీలించారు. రైతులు ఆకేటి బాబులు, ఆకుల శ్రీనివాసరావు తుఫాన్ వల్ల తమ పొలాలు దెబ్బతిన్నాయని, తగిన పరిహారం చెల్లించాలని కోరారు.

చీకట్లోనే మారుమూల ప్రాంతాలు

మొంథా తుఫాన్ కారణంగా రెండు రోజులుగా మండలంలోని గ్రామాలు చీకట్లో ఉన్నాయి. బుధవారం సాయంత్రానికి కొన్ని ప్రధాన గ్రామాలకు మాత్రమే విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. ఉప్పలగుప్తం, టి.చల్లపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో 68 విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. ఎల్టీ, 11కేవీకి సంబంధించి 10.50 కి.మీ కేబుల్ ధ్వంసమైంది. తుఫాన్‌కు ముందుగానే అన్ని జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ ఇప్పటికీ సరఫరా పునరుద్ధరణ జరగక వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. తుఫాన్ అలజడి తగ్గడంతో బుధవారం మధ్యాహ్నం పునరావాస కేంద్రాల్లోని వారిని వాహనాల్లో ఇళ్లకు పంపించినట్టు తహసీల్దార్ వాసా దివాకర్ తెలిపారు. రహదారులకు అడ్డంగా కూలిన చెట్లను ఎప్పటికప్పుడు తొలగించామన్నారు.

నేలనంటిన వరి చేలు

మామిడికుదురు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో మంగళవారం వీచిన గాలులకు సార్వా చేలు నేలనంటాయి. మండలంలో 2700 ఎకరాల్లో రైతులు సార్వా సాగు చేశారు. తుఫాన్ ప్రభావంతో వంద ఎకరాల్లో వరిచేలు నేలనంటాయని సంబంధిత అధికారులు అంచనాలు వేస్తున్నారు. ఈనిక సమయంలో అపార నష్టం వాటిల్లే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈనిక సమయంలో తుఫాన్ తమను నట్టేట ముంచిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

పడిపోయిన అరటి తోట.. ఆందోళనలో రైతు

మామిడికుదురుకు చెందిన గనిశెట్టి నాగేశ్వరరావు తన నాలుగు ఎకరాల అరటితోట నేలమట్టమైందని ఆందోళన వ్యక్తం చేశాడు. తన తోటలోని గెలలు వేసే సమయంలో తుఫాన్ ప్రభావంతో వీచిన గాలులకు నేలనంటి అపారనష్టం వాటిల్లిందని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని కోరుతున్నారు. ఇంకా మండలంలో కాయగూరల తోటలకు నష్టం వాటిల్లే ఆస్కారం ఉందని రైతులు పేర్కొంటున్నారు.

ఆందోళన అవసరం లేదు

కాట్రేనికోన, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): పల్లం గ్రామంలో ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, ఎంపీ హరీష్‌మాధుర్ బుధవారం పర్యటించారు. గోదావరి నీరు పల్లం గ్రామాన్ని చుట్టుముట్టింది. బాధితులతో వారు మాట్లాడారు. ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నారు. పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ సరఫరా, వైద్య అవసరాలు క్రమ పద్ధతిలోఅందుబాటులోకి వస్తాయని భరోసా ఇచ్చారు. ఈఅంశంపై అధికారులతో చర్చించారు.

నీట మునిగిన 2,650 ఎకరాల వరి

తుఫాను కారణంగా మండలంలో 5,426 ఎకరాలకు గాను 2,650 ఎకారలు సార్వా పంట నీట మునిగిందని మండల వ్యవసాయాధికారిణి బి.మృదుల తెలిపారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి పంట పొలాలను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు చెల్లి సురేష్, రంబాల రమేష్ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరించకపోవడంపై ఆగ్రహం

కాట్రేనికోన మండలంలో విద్యుత్ సరఫరా పునరుద్ధరించకపోవడంపై ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, అమలాపురం ఎంపీ హరీష్‌మాధుర్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సరైనప్రణాళిక లేకుండా పనిచేస్తున్నారని అన్నారు. ఎట్టిపరిస్థితుల్లోను బుధవారం రాత్రికి సరఫరా పునరుద్ధరించాలని ఆదేశించారు.

అంతర్వేది ఆలయంలో మంత్రి అచ్చెన్నాయుడు పూజలు



అంతర్వేది, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయానికి వ్యవసాయశాఖ మంత్రి, టీడీపీ జిల్లా ఇన్‌చార్జి కె.అచ్చెన్నాయుడు బుధవారం విచ్చేశారు. ఆయనకు ఆలయ సహాయ కమిషనర్ ప్రసాద్, అధికారులు ఘనస్వాగతం పలికారు. ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, టీడీపీ ఇన్‌చార్జి గొల్లపల్లి అమూల్యతో కలిసి స్వామి వారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ అర్చకులు, వేదపండితులు మహాదాశీర్వచనం జరిపించారు. అనంతరం స్వామివారి చిత్రపటం, ప్రసాదాన్ని ఆలయ అధికారులు అందజేశారు. కార్యక్రమంలో గుండుబోగుల పెద్దకాపు, గుబ్బల ఫణికుమార్, ముప్పర్తి నాని, చాగంటా స్వామి, మాలే శ్రీనివాసనగేష్, పోతురాజు కృష్ణ, రావూరి నాగు, మూలాస్వామి, బందెల పద్మ, మోకా పార్వతి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పదిలంగా డొక్కా సీతమ్మ జ్ఞాపకాలు

పి.గన్నవరం, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి):లంకలగన్నవరంలో డొక్కా సీతమ్మ నివాసంలో ఆమె జ్ఞాపకాలు ఇంకా పదిలంగానే ఉన్నాయని ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. లంకలగన్నవరంలో సీతమ్మ నివాసాన్ని బుధవారం ఆయన పరిశీలించి అనంతరం మాట్లాడారు. సీతమ్మ మరణించే వరకు ఆకలితో వచ్చిన ప్రతి ఒక్కరికి భోజనం పెట్టి ఆకలి తీర్చేదన్నారు. పాఠశాలల్లో జరుగుతున్న మధ్యాహ్నం భోజన పథకానికి డొక్కా సీతమ్మ పేరుపెట్టి ప్రభుత్వం చారిత్రాత్మక గుర్తింపు ఇచ్చిందన్నారు. సీతమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. సీతమ్మ జీవిత విశేషాలను డొక్కా ప్రభాకరమూర్తి ఆయనకు వివరించారు. మాజీఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, తమ లంపూడి రామకృ ష్ణారెడ్డి, పాలూరి సత్యానందం, చీకరమిల్లి శ్రీనివాసరావు, తిక్కా సత్తిబాబు, పసుపులేటి మహాలక్ష్మీరావు, చిట్టినీడి రంగాసాయి, తోలేటి సుబ్బారావు, కోలా గోపి, కనకరాజు, డొక్కా చినగోపాలం ఉన్నారు.

వీరవేణు కుటుంబాన్ని ఆదుకుంటాం: ఎమ్మెల్సీ

మామిడికుదురు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావానికి తాడిచెట్టు పడి మృతిచెందిన మాకనపాలెం గ్రామానికి చెందిన గూడపల్లి వీరవేణు కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకుంటామని ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. బుధవారం ఆయన స్థానిక నాయకులతో కలిసి వీరవేణు కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ప్రభుత్వ పరంగా ఆ కుటుంబానికి సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఆయనతో పాటు జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, ఎంఏ వేమా, నల్లా పవన్‌కుమార్, పాలూరి సత్యానందం, భైరిశెట్టి రామకృష్ణ, మెండా ఆదినారాయణ తదితరులు ఉన్నారు.

సఖినేటిపల్లి మండలం అతలాకుతలం

అంతర్వేది, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో మంగళవారం రాత్రి అంతర్వేదిపాలెం మీదుగా తీరం దాటిన అనంతరం మండలంలో 107 విద్యుత్ స్తంభాలు, పలు ట్రాన్స్‌ఫార్మర్లు నేలకొరిగాయి. కొబ్బరిచెట్లు, భారీవృక్షాలు రోడ్డుకు అడ్డంగా విరిగి పడిపోయాయి. అలాగే పునరావాస కేంద్రాల వద్ద ఉన్న బాధితులకు మండల అధికారులు, సిబ్బంది భోజన వసతి కల్పించి మందులు ఉచితంగా అందించారు. 19పునరావాస కేంద్రాల్లో ప్రజలకు సౌకర్యాలు కల్పించారు. అంతర్వేది పల్లిపాలెం, కేశవదాసుపాలెం, అంతర్వేదికర హైస్కూలులో బాధితులకు ఉచితంగా వైద్య సిబ్బంది పరీక్షలు నిర్వహించి ఆహారం అందించారు. నేలకొరిగిన చెట్లను స్థానిక పంచాయతీ సిబ్బంది తొలగించారు. విద్యుత్ సిబ్బంది స్తంభాలను ఏర్పాటుచేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినా రాత్రి 8గంటల వరకు విద్యుత్ లేక మండలంలో కొన్ని గ్రామాలు అంధకారంలో ఉన్నాయి. రెండు రోజులు విద్యుత్ లేక తాగునీరు అందక, సెల్‌ఫోన్ చార్జింగ్‌లు లేక చిరువ్యాపారులు ఇక్కట్లకు గురయ్యారు. అంతర్వేది ప్రధాన రహదారి రాంబాగ్ వద్ద ముంపునకు గురి కావడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రెడ్‌క్రాస్ సభ్యులు 300 మంది తుఫాన్ బాధితులకు సేవలందించారు. ఉదయం ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ కూటమి నాయకులతో కలిసి పల్లిపాలెం గ్రామంలో సందర్శించి బాధితులకు ధైర్యం చెప్పారు.

ఊపిరిపీల్చుకున్న యానాం ప్రజలు



చెట్ల తొలగింపు ప్రక్రియను పరిశీలిస్తున్న ఢిల్లీ ప్రతినిధి మల్లాడి

యానాం,అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ మంగళవారం అర్ధరాత్రి నర్సాపురం వద్ద తీరం దాటడంతో యానాం ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. ఆ సమయంలో భారీగా ఈదురుగాలులు వీయడంతో పాటు చిరుజల్లులు కురిసాయి. యానాంలో 20చోట్ల భారీచెట్లు పడిపోయాయి. యానాం అగ్నిమాపకశాఖ, ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది చెట్లను తొలగించారు.విద్యుత్ తీగలపై చెట్లు పడిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. యానాం అంతా అంధకారంగా మారింది. బుధవారం ఉదయం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. పుదుచ్చేరి రెవెన్యూ, ఆర్థికశాఖకార్యదర్శి ఉప్పు కృష్ణమోహన్ బుధవారం మధ్యాహ్నం యానాం చేరుకున్నారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించి ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌తో కలిసి తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. పరిపాలనాధికారి అంకిత్‌కుమార్, ప్రత్యేకాధికారి అమన్‌శర్మలు పరిస్థితిని వివరించారు. యానాం తీర ప్రాంతాల్లో ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పర్యటించారు. తీరంలోని అన్నిగ్రామాల్లో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, ఎన్ఆర్ కాంగ్రెస్ పార్టీ యానాం అధ్యక్షుడు మల్లాడి శామ్యూల్, కాంగ్రెస్ పార్టీ యానాం అధ్యక్షుడు ఆర్థాని దినేష్, కాటంశెట్టి రామ్మూర్తి, బీజేపీ యానాం అధ్యక్షుడు కనకాల రాజు, వ్యాపారవేత్త తోట రాజు తీరప్రాంతాల్లో పర్యటించి ప్రజలు, మత్స్యకారులతో మాట్లాడారు.



రాజోలు: కాట్రేనిపాడులో నీట మునిగిన వరిచేలు

తుఫాన్‌ పరిస్థితిని సీఎంకు వివరించిన ఎమ్మెల్యే సుబ్బరాజు

ముమ్మిడివరం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో జరిగిన నష్టం పరిస్థితిని సమీక్షించడానికి అల్లవరం మండలం ఓడలరేవులో పర్యటించిన సీఎం చంద్రబాబును ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు కలిశారు. తుఫాన్ కారణంగా ముమ్మిడివరం నియోజకవర్గం పరిధిలో వ్యవసాయ, ఉద్యాన, ఆక్వా తదితర రంగాలకు జరిగిన నష్టాన్ని వివరించి రైతులను ఆదుకోవాలని కోరారు. తుఫాన్‌కు ముందు, తరువాత చేపట్టిన చర్యలను సీఎంకు ఎమ్మెల్యే సుబ్బరాజు వివరించారు.

అయ్యప్ప స్వాములకు సైకిళ్ల అందజేత

యానాం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): యానాం నుంచి నవంబరు ఒకటో తేదీన శబరిమలైకు అయ్యప్పస్వాములు సైకిల్‌పై వెళ్లనున్నారు. బుధవారం ఐదుగురు స్వాములకు ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి రూ.40వేలతో సైకిళ్లను అందజేశారు.

అరటి పంటకు తీవ్ర నష్టం

అల్లవరం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా అరటి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. బోడసకుర్రు, గోపాయిలంక, కోడూరుపాడు, యెంట్రుకోన, గోడితిప్పగ్రామాల్లో అరటి తోటలకు, కొబ్బరిచెట్లకు నష్టం వాటిల్లింది. ధర బాగున్న సమయంలో అరటి, కొబ్బరి పంటలకు నష్టం ఏర్పడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు.

కోఆపరేటివ్ బ్యాంకు 85వ శాఖ ప్రారంభం

అమలాపురం టౌన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ది అమలాపురం టౌన్ కోఆపరేటివ్ బ్యాంకు 58వ శాఖను బ్యాంకు మార్గదర్శకులు మానం అంజనేయులు, బ్యాంకు చైర్మన్ ఎం.వెంకటరత్నం అమలాపురంలో ప్రారంభించారు. కార్యక్రమంలో ఇన్నీసుపేట కోఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ కోళ్ల అచ్యుతరామారావు, వైస్‌చైర్మన్ మహ్మద్‌అమీర్, చాణుక్య, కోఆపరేటివ్ సొసైటీ వైస్‌చైర్మన్ గజేంద్రకుమార్, మిత్రా కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ బసవా వీరరాఘవులు, జిల్లా సహకార అధికారి రాధాకృష్ణ, అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోనం సత్యవరప్రసాద్, కల్వకొలను తాతాజీ పాల్గొన్నారు. ఈబ్యాంకు ద్వారా జరుగుతున్న కార్యకలాపాలను ముఖ్య కార్యనిర్వహణాధికారి వీవీవీ వరలక్ష్మి వివరించారు.

వీరభద్రానికి గౌరవ పురస్కారం



అమలాపురం రూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): అమలాపురం శ్రీకామాక్షీ పీఠం మహాసంస్థాన ఆస్థాన సిద్ధాంతి, ప్రముఖ పంచాంగకర్త డాక్టర్ కర్రా వీరభద్రం సిద్ధాంతికి ధర్మక్షేత్ర జ్యోతిష్య గౌరవ పురస్కారం లభించింది. కురుక్షేత్రంలో జరిగిన కురుక్షేత్ర డెవలెప్మెంట్ హోప్ ఆధ్వర్యంలో ధర్మక్షేత్ర మహాజోతిష్య మహాకుంభ్-2025లో జోతిష్య శాస్త్రంలో నిర్విరామ కృషి చేస్తున్న వారిలో ప్రముఖ జోతిష్యునిగా వీరభద్రాన్ని గుర్తించి ఈపురస్కారాన్ని అందించారు. పేరూరు విశ్వేశ్వర అగ్రహారానికి చెందిన వీరభద్రం అత్యున్నత పురస్కారం అందుకోవడం పట్ల సంస్కార భారతి రాష్ట్ర ప్రాచీన కళాప్రముఖ్ పుత్సా కృష్ణకామేశ్వర్, రాష్ట్ర మహిళా ప్రముఖ్ వేదనభట్ల సాయిలక్ష్మి, చెక్కా సత్యనారాయణమూర్తి, కూచి కృష్ణప్రసాద్, గోటేటి గంగాధరరావు, వెత్సా సాయి అభినందనలు తెలిపారు.

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం


ఆలమూరు మండలం పెనికేరులో తుఫాన్ నష్టాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు


రామచంద్రపురం మండలం ఓదూరులో నేలకొరిగిన పంట పొలాలను పరిశీలిస్తున్న మంత్రి సుభాష్


కపిలేశ్వరపురం మండలం అంగరలో నేలనంటిన వరిచేను


రాయవరంలో పునరావాస కేంద్రాలకు అందించేందుకు పీఠం ప్రతినిధులు సిద్ధం చేసిన పులిహోర

ఎంత నష్టం...ఎంత కష్టం

• తుఫాన్ ప్రాంతాల్లో మంత్రి సుభాష్, ఎమ్మెల్యే బండారు పర్యటన • నష్టపోయిన రైతులను ఆదుకుంటామని హామీ

ద్రాక్షారామ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తుపాను కారణంగా నష్టపోయిన అన్నదాతలకు అండగా ఉంటామని మంత్రి సుభాష్ స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తామన్నారు. బుధవారం రామచంద్రపురం మండలం ఓదూరులో నేలవాలిన వరిపొలాలను మంత్రి పరిశీలించారు. రైతులకు అండగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు. నియోజకవర్గంలో సుమారు 51,800 ఎకరాల్లో ఖరీఫ్ సాగు జరిగిందని, తుపాను వల్ల 41 వేల ఎకరాల్లో పంటపొలాలు నేలమట్టం అయ్యాయన్నారు. పంట నష్టం వివరాలపై నివేదిక ఇవ్వాలని వ్యవసాయశాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. రైతులు ఆందోళన చెందవద్దని ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో ఓదూరు సర్పంచ్ వి.విమలకుమారి, కూటమి నాయకులు చుండ్రు సూరిబాబు, కొండేపూడి సత్తిబాబు, అద్దంకి కృష్ణ, బుంగ అప్పారావు, పలువురు రైతులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

ఆలమూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులను ఆదుకుంటామని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. బుధవారం ఆలమూరు మండలంలోని జొన్నాడ, పెనికేరు గ్రామాల్లో ఆయన పర్యటించారు. తుఫాన్ వల్ల ఖరీఫ్ వరిపంటతోపాటు అనేక రకాల వాణిజ్య పంటలకు తీవ్ర నష్టం జరిగిందని త్వరలో పంట నష్టాలను గుర్తిస్తామన్నారు. జొన్నాడలో పంట సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని దీన్ని పరిష్కరించాలని ఎమ్మెల్యే దృష్టికి పలువురు తీసుకొచ్చారు. పంట నష్టం పరిశీలనలో తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, తెలుగు రైతు మండల అధ్యక్షుడు కోన దత్తుడు, మండల ప్రత్యేకాధికారి లక్ష్మీప్రత్యూష, తహశీల్దార్ కేజే ప్రకాష్‌బాబు, ఎంపీడీవో ఎ.రాజు, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

తుఫాన్ బాధితులకు అండ

ఆత్రేయపురం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా పంటలు కోల్పోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఆర్డీవో శ్రీకర్ పేర్కొన్నారు. బుధవారం వెలిచేరు, కట్టుంగ, నార్కెడిమిల్లి, వసంతవాడ, వద్దిపర్రు తదితర గ్రామాల్లో ఆర్డీవో శ్రీకర్‌తో కలిసి నష్టపోయిన పంట పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, టీడీపీ మండల అధ్యక్షుడు కూసంపూడి రామకృష్ణంరాజు, నాగిరెడ్డి సత్యనారాయణ, జుజ్జవరపు హరిబాబు, వెత్సా అనిల్ తదితరులు పాల్గొన్నారు.

అంతర పంటకు భారీ నష్టం: మొంథా తుఫాన్ కారణంగా అంతర పంటలకు తీవ్ర నష్టం ఏర్పడింది. కొత్తపేట సబ్ డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల్లో ఉద్యానశాఖ అధికారులు పంటనష్టాల అంచనాను రూపొందిస్తున్నారు. తుఫాన్ ప్రభావంతో అరటి, కూరగాయలు, బొప్పాయి తదితర పంటలు దెబ్బతిన్నాయి. 1,635 ఎకరాల్లో 1,580 మంది రైతులు పంటల ద్వారా నష్టపోయినట్టు అంచనాలు రూపొందించామని ఉద్యానశాఖాధికారి జి.కోటేశ్వరరావు తెలిపారు. ఆత్రేయపురం మండలంలో 100 హెక్టార్లలో వరికి నష్టం వాటిల్లినట్టు వ్యవసాయ అధికారి మహేష్ తెలిపారు. విద్యుత్ స్తంభాలు 12 పడిపోయాయని వెంటనే వాటిని ఏర్పాటు చేసి విద్యుత్ సదుపాయాన్ని కల్పించినట్లు ట్రాన్స్‌కో ఏఈ అశోక్ తెలిపారు. 17 గ్రామాల్లో 970 మంది నిర్వాసితులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తహశీల్దారు రాజేశ్వరరావు తెలిపారు.

తుఫాన్ ప్రభావానికి ధ్వంసమైన టెంట్లు: వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో తుఫాన్ ప్రభావంతో దేవస్థానం తిరువీధుల్లో ఏర్పాటు చేసిన పెండల్స్ (టెంట్లు) భారీ ఈదురుగాలులకు ధ్వంసమయ్యాయి. మాడవీధుల్లో భక్తుల సౌకర్యార్థం వేసిన టెంట్ పరికరాలు ఈదురుగాలలకు కుప్పకూలాయి. శ్రీనివాస ప్రాంగణంలో అన్నదాన షెడ్‌పై బరకాలు ఎగిరిపోయాయి. వర్షం తగ్గిన వెంటనే పనులు చేపడతామని ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

తుఫాన్ పునరావాస కేంద్రాలకు వెంకన్న భోజనాలు: మండలంలోని 17 గ్రామాల్లో తుఫాన్ పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. లోతట్టు ప్రాంతాల వారిని సమీప పునరావాస కేంద్రాలకు తరలించారు. అక్కడ ఉంటున్న 970 మంది నిర్వాసితులకు వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం అల్పాహారం, భోజనాలు ఏర్పాటు చేశారు. ఆయా పునరావాస కేంద్రాల్లో ఉంటున్న వారికి భోజనాలు పంపిస్తున్నట్లు ఆలయ ఉపకమిషనరు తెలిపారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి: మొంథా తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి కోరారు. బుధవారం ఆత్రేయపురం మండలం ఉచ్చిలి గ్రామంలో పంట పొలాలను పరిశీలించి నష్టపోయిన రైతులను తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

నేలవాలిన వరి పొలాల పరిశీలన

కె.గంగవరం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. తుఫాను కారణంగా వీచిన ఈదురు గాలులకు వరి పొలాలు నేలకొరిగాయి. ఇప్పుడున్న దశలో పొలాలు పడిపోతే దిగుబడిపై తీవ్ర ప్రభావం ఉంటుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నీటిని మళ్లించే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. మండల వ్యవసాయ శాఖ అధికారి ఏ.సద్గురుమూర్తి బుధవారం యండగండి, పామర్రు, కూళ్ల, సుందరపల్లి, దంగేరు, కోట గ్రామాల్లో పర్యటించారు. పడిపోయిన వరి పొలాలను ఆయన పరిశీలించారు. ఆయన వెంట కూటమి నాయకులు మరివాడ సూరిబాబు, శీరెడ్డి సత్తిబాబు, తాడాల జనకీరామ్, వీఏఏలు శ్రీలక్ష్మి, హరిబాబు, భూషణం తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం: తుఫాను కారణంగా వీచిన ఈదురుగాలులకు అముజూరు సొసైటీ వద్ద ఉన్న కొబ్బరి చెట్టు పడిపోయింది. దీంతో అక్కడున్న విద్యుత్ స్తంభం విరిగిపోగా కరెంట్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మార్కెట్ కమిటీ డైరెక్టర్ మరివాడ చిన్నికృష్ణ కరెంట్ సమస్యను మంత్రి సుభాష్‌కు వివరించారు. తక్షణమే రెండు విద్యుత్ స్థంభాలను మంజూరు చేయించారు. బుధవారం ఏఈ భాస్కర కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది రెండు విద్యుత్ స్థంభాలను నిలబెట్టి కరెంట్ సరఫరా పునరుద్ధరించే చర్యలు చేపట్టారు.

3,382 హెక్టార్లలో వరిపంట నష్టం

కపిలేశ్వరపురం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నేలటూరు, వెదురుమూడి, కపిలేశ్వరపురం గ్రామాల్లో నష్టానికి గురైన పంట పొలాలను ఏవో బి.రవి బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 3,382 హెక్టార్లలో వరిపంట నీటమునిగి నష్టానికి గురైనట్లు అంచనా వేసినట్టు తెలిపారు. పంట నష్టం అంచనా కోసం గురువారం నుంచి గ్రామస్థాయి బృందాలు పొలాలను పరిశీలించి నమోదు చేస్తారన్నారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల వ్యవసాయ సహాయకులు, పలువురు రైతులు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాల నుంచి పయనం: మండలంలోని 21 పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందిన 924 మంది బుధవారం ఇళ్లకు తరలివెళ్ళారు. గాలులు, వర్షం లేకపోవడంతో వారి ఇళ్లకు వెళ్ళిపోయినట్లు తహసీల్దార్ జి. శ్రీనివాస్ తెలిపారు. లంకగ్రామాలు మినహా మండలంలోని మిగిలిన గ్రామాల్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించామన్నారు. బుధవారం సాయంత్రానికి ఆయా లంక గ్రామాలకు విద్యుత్ సరఫరా జరగనున్నట్టు తెలిపారు.


కె.గంగవరం మండలం యండగండిలో నేలకొరిగిన వరి పొలాన్ని పరిశీలిస్తున్న ఏవో సద్గురుమూర్తి తదితరులు


ఆత్రేయపురం మండలం ఉచ్చిలిలో దెబ్బతిన్న అరటి పంటను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారి

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

కొత్తపేట, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. బుధవారం ఆయన కొత్తపేట మండలం పనసలదొడ్డి, రామనూతిమెరక తదితర ప్రదేశాలలో దెబ్బతిన్న వరి పొలాలు, అరటి పంటలను పరిశీలించారు.


కొత్తపేట శివారు పనసలదొడ్డిలో దెబ్బతిన్న అరటి పంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సత్యానందరావు


మండపేట మండలం మారేడుబాకలో నేలకొరిగిన వరిపంటను చూపిస్తున్న కౌలు రైతులు

ఆయన మాట్లాడుతూ నష్టాన్ని అంచనా వేసిన వెంటనే పరిహారం అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు యల్లమిల్లి జగన్మోహన్, గనిశెట్టి వీరేష్, ఏడీఏ ఎంవీ రామారావు, వ్యవసాయశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాను పునరుద్ధరించండి: తుఫాన్ ప్రభావంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిన నేపథ్యంలో తక్షణమే మరమ్మతులు పూర్తిచేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని సంబంధిత అధికారులు ఆదేశాలు జారీ చేశారు. కొత్తపేట సమితి రోడ్డులో విద్యుత్ స్తంభాలు విరిగి లైన్లు ధ్వంసమైన ప్రదేశాలను ఎమ్మెల్యే బుధవారం పరిశీలించారు. వెంటనే విద్యుత్‌ను పునరుద్ధరించే చర్యలు వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో కంఠంశెట్టి శ్రీనివాసరావు, బూసి భాస్కరరావు, గనిశెట్టి వీరేష్, యల్లమిల్లి జగన్మోహన్, పల్లికొండ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

12,922 ఎకరాల్లో పంట నష్టం

మండల వ్యవసాయ అధికారి ప్రభాకర్

మండపేట, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా 12,922 ఎకరాల్లో వరిపంట పూర్తిగా దెబ్బతిందని మండపేట మండల వ్యవసాయ అధికారి ప్రభాకర్ తెలిపారు. మండపేట మండలంలో పంటనష్టం వివరాలను ప్రభుత్వానికి నివేదించామని తెలిపారు. బుధవారం ఆయన పాడైన పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు.

విద్యుత్ సబ్‌డివిజన్‌లో రూ.8లక్షల మేర నష్టం: మండపేట విద్యుత్ సబ్ డివిజన్‌లో రూ.8 లక్షలమేర నష్టం వాటిల్లిందని మండపేట విద్యుత్‌శాఖ ఏడీఈ సీహెచ్ శ్రీధర్ తెలిపారు. మండపేట అర్బన్, రూరల్, రాయవరం, ఆలమూరు మండలాల్లో 50 విద్యుత్ స్తంభాలు నేలకూలాయన్నారు. రాయలసీమ నుంచి వచ్చిన విద్యుత్ సిబ్బందితో కలిసి విద్యుత్‌ను పునరుద్ధరించామని ఆయన తెలిపారు.

సురక్షిత ప్రాంతాలకు తరలింపు: మండలంలోని 534 కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించామని మండపేట తహసీల్దార్ పి.తేజేశ్వరరావు తెలిపారు. తుఫాన్ వల్ల నష్టపోయిన 250 కుటుంబాలను గుర్తించి వారికి ప్రభుత్వ సాయం అందిస్తామన్నారు. తుఫాన్ వల్ల 28 ఇళ్ల వరకు దెబ్బతిన్నాయని తెలిపారు. మండపేట మండలంలో 1,350 ఎకరాల్లో వరి పంట దెబ్బతిందని ఆయన అన్నారు.

తుఫాన్‌ను ఎదుర్కొన్నాం: కమిషనర్ రంగారావు: తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు 24 గంటల పాటు సిబ్బందితో కలసి పనిచేశామని కమిషనర్ టీవీ రంగారావు చెప్పారు. పట్టణంలో మూడు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి బాధిత కుటుంబాలకు వసతి కల్పించామన్నారు. పట్టణంలో విద్యుత్ సరఫరాతోపాటు మంచినీరు సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు.

రైతులను ఆదుకోవాలి: తుఫాన్ కారణంగా చేతికందే పంట దెబ్బతిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమను ఈ తుఫాన్ నిలువునా ముంచేసిందని రైతులు వాపోతున్నారు. కౌలు రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. ఎకరాకు రూ.28 వేల వరకు పెట్టుబడి అయిందన్నారు. ఇప్పుడు పెట్టుబడి కూడా దక్కే పరిస్థితి లేదని తమను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరుతున్నారు.


రాయవరం మండలం చెల్లూరులో నేలవాలిన వరిపంటను పరిశీలిస్తున్న ఏవో తదితరులు


రావులపాలెం మండలం గోపాలపురంలో నేలకొరిగిన పంట పొలాల్లోని నీటిని బయటకు మళ్లిస్తున్న రైతులు


ఆత్రేయపురం మండలం వాడపల్లి వెంకన్న ఆలయంలో తుఫాన్ గాలులకు ఎగిరిపోయిన పెండల్స్


కపిలేశ్వరపురం మండలం వెదురుమూడిలో నీటమునిగిన పొలాలను పరిశీలిస్తున్న ఏవో రవి

పంట పొలాలను పరిశీలించిన ఏవో

రాయవరం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను కారణంగా వీచిన గాలులకు మండలంలోని 12 గ్రామాల్లోని వరిపంట నేలవాలింది. బుధవారం ఆయా గ్రామాల్లోని వరిపంటను మండల వ్యవసాయ అధికారి కేవీఎస్ రమేష్ కుమార్ పరిశీలించారు. రాయవరం, మాచవరం, చెల్లూరు, వెంటూరు, కురకాళ్లపల్లి, కుర్మాపురం గ్రామాల్లోని పంట పొలాలను ఏవో పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 1,879 హెక్టార్ల విస్తీర్ణంలో పంట నీటిలో మునిగిందని, 2,683 హెక్టార్లలో పంట పడిపోయిందన్నారు. అలాగే 4,562 హెక్టార్ల విస్తీర్ణంలో నష్టం జరిగినట్లు తెలిపారు. వ్యవసాయశాఖ అధికారి వెంట గ్రామ వ్యవసాయ సహాయకులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పులిహోర పంపిణీ: మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు వెదురుపాక విజయదుర్గా పీఠం ప్రతినిధులు బుధవారం పులిహోర పంపిణీ చేశారు. పీఠాధిపతి గాడ్ కుమార్తెలు బి.రమ, సత్య వెంకటకామేశ్వరి, రమ ఆధ్వర్యంలో పీఠంలో పులిహోర చేయించి పునరావాస కేంద్రాలకు అందజేశారు. తహశీల్దారు బీవీ భాస్కరరావు ఆధ్వర్యంలో సిబ్బంది పునరావాస కేంద్రాల్లోని వారికి పులిహోర అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత ఉండవిల్లి రాంబాబు, ఉద్యోగులు పాల్గొన్నారు. విజయదుర్గా సేవా సమితి ప్రతినిధులను తహశీల్దారు అభినందించారు.

రైతులకు కూటమి ప్రభుత్వం అండ

రావులపాలెం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా పంట నష్టపోయిన రైతులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. తుఫాన్ వల్ల నేలకొరిగిన వరి పొలాలు, ఉద్యాన పంటలను నాయకులు, అధికారులతో కలిసి బుధవారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఈతకోట, రావులపాడు తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించి పంట నష్టంపై రైతులను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ తుఫాన్ వల్ల నష్టపోయిన రైతులకు పరిహారం అందేలా అధికారులు నమోదు ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఆయా గ్రామాల్లో వరి, ఉద్యాన పంటలు ఎంత వరకు నష్టపోయాయో త్వరితగతిన నష్టం అంచనాను సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.రామకృష్ణ, గుత్తుల రాంబాబు, యర్రంశెట్టి బుజ్జి, కొప్పిశెట్టి ప్రసాద్, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్‌తో నష్టపోయాం: పంట చేతికి వస్తున్న తరుణంలో తుఫాన్ కారణంగా చాలా నష్టపోయామంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రావులపాలెం మండలంలో రైతులు స్వర్ణ, 1318 రకం వంగడాలను సాగు చేశారు. స్వర్ణ రకం ఈనిక దశ పూర్తి చేసుకుని గింజ పాలు పోసుకుంటోంది. అలాగే 1,318 రకం ఈనిక దశలో ఉంది. ఇటువంటి సమయంలో పంట నేలకొరగడంతో దిగుబడిపై ప్రభావం చూపి తీవ్ర నష్టం ఎదుర్కోవాల్సి వస్తుందంటూ రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఉద్యాన, వాణిజ్య పంటలు సైతం దెబ్బతిన్నాయి. ప్రధానంగా అరటిగెలలు తయారీ దశలో ఉన్న తోటలు సైతం నేలకొరిగాయి. దీంతో ఆయా వాణిజ్య పంటలకు తీవ్ర నష్టం ఏర్పడింది.

అరకొర బస్సులతో ప్రయాణీకులు ఇబ్బందులు: తుఫాన్ నేపథ్యంలో బుధవారం కూడా ఆర్టీసీ బస్సులు అరకొరగా తిరగడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉదయం నుంచి ఈదురుగాలులు, వర్షం కురవడంతో ప్రయాణీకుల సంఖ్య కూడా తక్కువగా ఉంది. రావులపాలెం డిపో నుంచి రోజూ 66 బస్సు సర్వీసులు నడుపుతుండగా, 33 సర్వీసులు నడిపినట్టు డిపో మేనేజర్ కుమార్ తెలిపారు.

పంట నష్టం నమోదుపై ప్రాథమిక అంచనా: తుఫాన్ కారణంగా సంభవించిన పంట నష్టాలపై ప్రాథమిక అంచనా సిద్ధం చేసినట్లు ఏవో లక్ష్మీలావణ్య తెలిపారు. రావులపాలెం మండలంలో 10 గ్రామాల్లో 973 మంది రైతులకు సంబంధించి 1,423 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా వేసినట్లు ఆమె తెలిపారు. క్షేత్రస్థాయిలో పర్యటించి పూర్తిస్థాయిలో పంట నష్టం అంచనా నివేదికను త్వరితగతిన సిద్ధం చేస్తున్నట్లు ఆమె తెలిపారు.


ఆర్థికసాయం అందజేస్తున్న మంత్రి సుభాష్

మంత్రి ఆర్థికసాయం

రామచంద్రపురం(ద్రాక్షారామ), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో మృతి చెందిన బాధితుల కుటుంబీకులకు బుధవారం మంత్రి సుభాష్ ఆర్థికసాయం అందజేశారు. ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో పురావస్తుశాఖ ఆధ్వర్యంలో పనిచేసే ద్రాక్షారామకు చెందిన డి.భీమన్న విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. దీంతో వారి కుటుంబీకులకు మంత్రి రూ.25వేలు ఆర్థికసాయం, ఆలయ సహాయ కమిషనరు అల్లు వెంకట దుర్గాభవానీ నెల జీతం, ఆలయ సిబ్బంది సమకూర్చిన మొత్తం రూ.2.25 లక్షల ఆర్థికసాయాన్ని మంత్రి అందచేశారు. రామచంద్రపురం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో బుధవారం విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన బూర్ల చైతన్యకృష్ణ కుటుంబానికి మంత్రి రూ.25 వేలు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పి.చంద్రశేఖర్ రూ.10వేలు, సి.వాసు రూ.15 వేలు మొత్తం రూ.50 వేల ఆర్థికసాయాన్ని మంత్రి అందజేశారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పి.చంద్రశేఖర్, కూటమి నాయకులు కంచుమర్తి బాబూరావు, టి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల. చిత్రంలో చైర్‌పర్సన్ నూకదుర్గారాణి

ప్రభుత్వ స్థలాలు ఆక్రమణ అవుతున్నా పట్టించుకోరా?

మండపేట, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మండపేట మున్సిపాల్టీకి చెందిన 18 ఎకరాల స్థలం ఉందని అక్కడ ఆక్రమణలకు గురైన స్థలం సంగతి ఏమిటంటూ వైసీపీ కౌన్సిలర్లు, ఎక్స్‌అఫీషియో సభ్యుడు రెడ్డి రాధాకృష్ణ ప్రశ్నించారు. దీనిపై పట్టణ ప్రణాళిక అధికారి రమ్య పొంతనలేని సమాధానాలు చెప్పడంతో పలువురు అసంతృప్తి వ్యక్తం వ్యక్తం చేశారు. వచ్చే సమావేశం నాటికి వాటర్‌వర్క్సు స్థలం వ్యవహారంపై వివరణ ఇవ్వాలని సభ్యులు కోరారు. మండపేట మున్సిపల్ కౌన్సిల్ సమావేశం బుధవారం చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి అధ్యక్షతన జరిగింది. ఎక్స్ అఫీషియో సభ్యుడిగా హాజరైన ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు మాట్లాడుతూ తుఫాన్ సమయంలో ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సహకరించిన అధికార యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు. పట్టణ 20వ వార్డులోని గొల్లపుంత కాలనీలో ఇళ్లస్థలాలు విక్రయించిన వారితో పాటు ఇళ్లను నిర్మించుకోని వారిపై చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హెచ్చరించారు. ఇదే అంశంపై దర్యాప్తు చేసి ఆక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు. అర్హులైన వారంతా డిసెంబరు నాటికల్లా ఇంటి నిర్మాణం పనులు చేసుకోవాలని లేకుంటే వాటిని రద్దు చేసి అర్హులకు ఇస్తామని ఎమ్మెల్యే తెలిపారు. పట్టణంలో కుక్కల బెడద నివారించాలని కౌన్సిలర్ గ్రంధి శ్రీనువాస్ కోరారు. విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు చేస్తున్నా అధికారులు ఫోన్ తీయడం లేదని కౌన్సిలర్ యారమాటి గంగరాజు సభ దృష్టికి తీసుకువచ్చారు. కుళాయి పన్నును రూ.5 పెంచుతూ కౌన్సిల్ ఆమోదించింది. సమావేశంలో పలు అంశాలను కౌన్సిల్ ఆమోదించింది. తుఫాన్ సమయంలో అధికార యంత్రాంగంతో పాటు విద్యుత్, రెవెన్యు, పంచాయతీరాజ్, పోలీసు, మండల పరిషత్ అధికారులు, పారిశుధ్య కార్మికుల పనితీరు అభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పి.గణేశ్వరరావు, కౌన్సిలర్‌లు చుండ్రు చినసుబ్బారావు చౌదరి, కాళ్లకూరి స్వరాజ్య భవాని, శిరంగు జ్యోతి, చింతలపడ దుర్గ, కోఆప్షన్ సభ్యుడు షేక్ ఇబ్రహీం, పోతంశెట్టి ప్రసాద్, పిల్లి శ్రీను, మొందు బాపిరాజు, కమిషనర్ టీవీ రంగారావు, డీఈఈ శ్రీనువాస్, ఏఈలు పవన్, అనూషలక్ష్మి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



బోను అభిషేక్

బ్యాడ్మింటన్ పోటీల్లో అభిషేక్‌కు కాంస్య పతకం

రామచంద్రపురం(ద్రాక్షారామ), అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తమిళనాడు బాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల మధురైలో జరిగిన యోనెక్స్ సన్‌రైజ్ ఆల్ ఇండియా జూనియర్ ర్యాంకింగ్ బాడ్మింటన్ టోర్నమెంటు 2025లో రామచంద్రపురం మోడరన్ జూనియర్ కళాశాల విద్యార్థి బోను అభిషేక్ అండర్ 19 డబుల్స్ విభాగంలో కాంస్య పతకం సాధించినట్టు మోడరన్ విద్యా సంస్థల అధినేత లయన్ జీవీ రావు తెలిపారు. అభిషేక్ పాల్గొంటున్న ప్రతి టోర్నమెంటులో ప్రతిభ చూపడం రామచంద్రపురానికి గర్వకారణమని అన్నారు. ఈ సందర్భంగా అభిషేక్‌ను అకడమిక్ డైరెక్టర్ కె.సాయిరామ్ చౌదరి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ రాజేష్, వైస్ ప్రిన్సిపాల్ పీఎస్ ప్రకాష్, అకడమిక్ అడ్వైజర్ సీహెచ్ శ్రీనివాస్, పలువురు సిబ్బంది అభినందించారు.


వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి అన్నదాన పథకానికి విరాళం ఇస్తున్న దృశ్యం

అన్నదాన పథకానికి విరాళం

ఆత్రేయపురం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో చేపడుతున్న నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన చిట్టూరి లిఖిత్ ఆదిత్య, రియాన్ష్ సాయి కుటుంబ సభ్యులు రూ.50,116 విరాళం ఇచ్చారు. దాతలకు ఆలయ సిబ్బంది స్వామి వారి చిత్రపటం అందజేశారు. బుధవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తజనం స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులు అన్న ప్రసాదంలో పాల్గొన్నారు.

వీరభద్రానికి గౌరవ పురస్కారం

అమలాపురం రూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): అమలాపురం శ్రీకామాక్షీ పీఠం మహాసంస్థాన ఆస్థాన సిద్ధాంతి, ప్రముఖ పంచాంగకర్త డాక్టర్ కర్రా వీరభద్రం సిద్ధాంతికి ధర్మక్షేత్ర జ్యోతిష్య గౌరవ పురస్కారం లభించింది. కురుక్షేత్రంలో జరిగిన కురుక్షేత్ర డెవలెప్మెంట్ హోప్ ఆధ్వర్యంలో ధర్మక్షేత్ర మహాజోతిష్య మహాకుంభ్-2025లో జోతిష్య శాస్త్రంలో నిర్విరామ కృషి చేస్తున్న వారిలో ప్రముఖ జోతిష్యునిగా వీరభద్రాన్ని గుర్తించి ఈపురస్కారాన్ని అందించారు. పేరూరు విశ్వేశ్వర అగ్రహారానికి చెందిన వీరభద్రం అత్యున్నత పురస్కారం అందుకోవడం పట్ల సంస్కారభారతి రాష్ట్ర ప్రాచీన కళాప్రముఖ్ పుత్సా కృష్ణకామేశ్వర్, రాష్ట్ర మహిళా ప్రముఖ్ వేదనభట్ల సాయిలక్ష్మి, చెక్కా సత్యనారాయణమూర్తి, కూచి కృష్ణప్రసాద్, గోటేటి గంగాధరరావు, వెత్సా సాయి అభినందనలు తెలిపారు.

